జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన దినపత్రికలో
పుట్టినరోజు/ ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు..
Rs.500/- 6x9 cms
కోర్టు నోటీసులు /పబ్లిక్/ కంపెనీస్ నోటీసులు..
Rs.600/- 4x10 cms
మొదలగు ప్రకటనల కోసం
8886022523, 9000621111, 9948725373
నెంబర్లలో సంప్రదించగలరు

సంపుటి 7 సంచిక 212 | హైదరాబాద్, అక్టోబరు 13 శుక్రవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

## తెలంగాణలోని 50 నియోజకవర్గాల్లో

# ఈసీ నజర్..




హైదరాబాద్, : ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో అధిక వ్యయం అయ్యే అవకాశం ఉన్న నియోజకవర్గాలపై ఈసీ దృష్టిసారించింది. ఆ తరహా నియోజకవర్గాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనుంది. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోని 12 నియోజకవర్గాలతోపాటు మరో 48 నియోజకవర్గాలను సమస్యాత్మకంగా గుర్తించారు. ఆయా ప్రాంతాలపై ఇప్పటి నుంచే నిఘా పెట్టారు. తెలంగాణలో ప్రారంభమైన ఎన్నికల ఫీవర్ ఈ ఏడాదంతా కొనసాగనున్న నేపథ్యంలో ఈసీ ఇందుకు అనుగుణంగా సిద్దమవుతోంది. బూత్‌ల గుర్తింపు ఇప్పటికే పూర్తికాగా అభ్యర్థులు, ధన ప్రవాహం వంటి వాటిపై నియంత్రణలు ఊపందుకున్నాయి. ఎక్కడికక్కడ ఎన్నికల్ కోడ్ అమలుకు కఠిన చర్యలు అమలవుతున్నాయి. మరోవైపు ఎన్నికల ఏర్పాట్లు జిల్లాల వారీగా పకడ్బం ధీగా జరుగుతున్నాయి. ఎన్నికలకు అవసరమైన పోలింగ్ స్టేషన్లు మొదలు పరిశీలకులు, నిఘా బృందాలు అన్నీ సమకూరుతున్నాయి. ఎన్నికల పరిశీలకులను నియోజకవర్గాల వారీగా ఈసీ నియమిస్తోంది. (మిగతా 2లో..)

# పార్వతీ కుండ్‌లో మోదీ

### పరమశివుని ఆలయాన్ని సందర్శించి పూజలు చేసిన ప్రధాని మోడీ

ఢీల్లి: ప్రజాపాలన ప్రతినిధి:ప్రధాని మోడీ గురువారం ఉత్తరాఖండ్ లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో రూ. 4200 కోట్లు విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసగించనున్నారు. పర్యటన లో భాగంగా ప్రధాని మోడీ పితోర్ఘడ్ జిల్లాలోని పార్వతీ కుండ్ వద్ద పరమ శివుడి దేవాలయాన్ని సందర్శించి, పూజలు చేశారు. జగదేశ్వర్ ధామ్, సరిహద్దున ఉన్న గుంజీ గ్రామాన్ని, కైలాశ్ పర్వతాన్ని కూడా సందర్శించారు.



## బీఆర్ఎస్ జెండా మోయని వారికి

# 'డబుల్' ఇళ్లు ఇవ్వం: దానం



హైదరాబాద్: ప్రజాపాలన ప్రతినిధి:బీఆర్ఎస్‌పార్టీ జెండా మోయని వారికి 'డబుల్' ఇళ్లు ఇవ్వమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గురువారం నాడు ఫిలింనగర్ బస్తీ క్యాడర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దానం నాగేందర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.."బీఆర్ఎస్ పార్టీ జెండా మోసిన వారికే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తాం. కాళ్లు పైకి తల కిందికి పెట్టిన బీఆర్ఎస్ జెండా మోయని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వం. పార్టీలో ఎప్పుడు మొహం కనిపించని వారికి ఇళ్లు కట్టించినా నేనే దగ్గరుండి కూలకొట్టిస్తా. పార్టీ నేతలు కూడా అలాంటి వారికి ఇళ్లు ఇవ్వాలని కోరవద్దు. మా పార్టీ కోసం పనిచేసే వారికే మేము సహాయం చేస్తాం" అని దానం నాగేందర్ పేర్కొన్నారు.

# బుల్లెట్ టూ బ్యాలెట్..

## ప్రజాక్షేత్రంలోకి గాజర్ల అశోక్ అలియాస్ ఐతు



హైదరాబాద్: ప్రజాపాలన ప్రతినిధి:మావోయిస్ట్ ఉద్యమానికి ఊపిరులూదిన వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల అశోక్ అలియాస్ ఐతు ప్రజాక్షేత్రంలోకి అడుగిడుతున్నారు. తాడిత పీడిత ప్రజల కోసం 25 ఏళ్ల తన ఉద్యమ ప్రస్థానాన్ని వీడి రాజకీయాల్లోకి వచ్చారు. కుటుంబ వారసత్వంగా వచ్చిన ఉద్యమ నేపథ్యాన్ని బలం, బలగంగా మార్చుకుంటూ.. నేను సైతం అంటూ ప్రజాక్షేత్రంలోకి దిగాడు ఐతు అలియాస్ గాజర్ల అశోక్. అప్పటి వరంగల్ ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామం అంటేనే గుర్తుకు వచ్చేది 'గాజర్ల' కుంటుంబం. అప్పటి పీపుల్స్‌వార్.. ఇప్పటి మావోయిస్టు పార్టీకి అంకితమైన కుటుంబం అది. ఆ కుటుంబానికి చెందిన వారంతా అప్పటి పరిస్థితులలో దొరల పాలనకు.. పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించిన వారే. ప్రజలలో చైతన్యం తెచ్చి హక్కుల కోసం పోరాడిన యోధులే. వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల కనకమ్మ-మల్లయ్య దంపతులకు రాజయ్య, సమ్మయ్య, సారయ్య, రవి, అశోక్‌లు సంతానం. వారికున్న ఎనిమిదెకరాల భూమితోపాటు గీత వృత్తి ఆ కుటుంబానికి ఆధారం. పెద్ద కొడుకు రాజయ్య అనారోగ్యంతో మరణించగా.. (మిగతా 2లో..)

## ఐసిస్ తరహాలో హమాస్‌నూ అణిచివేస్తాం: నెతన్యాహు



జెరూసలెం :ప్రజాపాలన ప్రతినిధి: ఇజ్రాయెల్, హమాస్ ఉగ్రమూకల మధ్య భీకర పోరు కొనసాగుతోంది. ఇరు పక్షాల మధ్య దాడులు, ప్రతిదాడులతో వేలాది మంది మరణించారు. ఇక ఐసిస్‌ను అణిచివేసిన తరహాలోనే హమాస్‌నూ ఉక్కుపాదంతో అణిచివేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రతినబూనారు. ఐసిస్ మాదిరే హమాస్‌తోనూ వ్యవహరించాలని తనను కలిసిన అమెరికా విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఆంటోని బ్లింకెన్‌తో భేటీ సందర్భంగా నెతన్యాహు పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడుల అనంతరం ఈ ప్రాంతంలో యుద్ధం కొనసాగుతుండగా ఇజ్రాయెల్, గాజాలో 3600 మందికి పైగా మృత్యువాతన పడ్డారు. గాజాలో విద్యుత్, ఆహారం, నీటి సరఫరాను బ్లాక్ చేయడం ద్వారా ఆ ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనంలోకి తీసుకున్నామని ఇజ్రాయెల్ ప్రకటించింది. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ బాంబులతో విరుచుకుపడుతుండటంతో మూడు లక్షల మందికి పైగా ప్రజలు తమ ఇండ్లను విడిచి పారిపోయారని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ఇక ఇజ్రాయెల్‌లో హమాస్ దాడులతో భారత్‌లో నివసిస్తున్న ఇజ్రాయెల్ వాసులు భయాందోళన మధ్య రోజులు వెళ్లదీస్తున్నారు. స్వదేశంలో తమ ఆత్మీయుల భద్రతపై ఆరా తీస్తూ ఆందోళన చెందుతున్నారు. వీరిలో కొందరు ఇజ్రాయలీలు కొద్దికాలంగా భారత్‌లో (మిగతా 2లో..)

# ఆస్ట్రేలియాకు ఘోర పరాభవం

### 134పరుగుల తేడాతో చిత్తుచిత్తుగా ఓడించిన దక్షిణాఫ్రికా వరుసగా రెండో ఓటమితో కంగారులు విలవిల




ప్రజాపాలన ప్రతినిధి: వన్డే ప్రపంచకప్-2023లో ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఘన విజయం సాధించింది. సఫారీలు విసిరిన భారీ లక్ష్యాన్ని ఛేధించలేక కంగారులు చతికిలపడ్డారు. లక్నోలోని అటల్ బిహారీ వాజ్‌పేయి స్టేడియంలో కంగారూ-ప్రొటీస్ జట్లు తలపడగా సఫారీలు మాసివ్ విక్టరీ నమోదు చేశారు. తద్వారా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకున్నారు. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. సౌతాఫ్రికా ఓపెనర్ క్వింటన్ డికాక్ వరుసగా రెండో శతకం(109)తో మెరవగా..గత మ్యాచ్‌లో విఫలమైన కెప్టెన్ తెంబా బవుమా(35) ఈసారి ఫర్వాలేదనిపించాడు.

## కేసీఆర్ నాయకత్వానికి ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారు : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : అసెంబ్లీ నియోజకవర్గాల ఇంఛార్జిల తొలి జాబితాను బీఆర్ఎస్ పార్టీ గురువారం విడుదల చేసింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు 54 నియోజకవర్గాలకు పార్టీకి సంబంధించిన సీనియర్ నాయకులను ఇంఛార్జిలుగా నియమించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గాల ఇంఛార్జిలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, దిశానిర్దేశం చేశారు.తెలంగాణ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు అద్భుతమైన సానుకూల వాతావరణం ఉన్నదని కేటీఆర్ స్పష్టం చేశారు. గత పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దులుగా ముందుకు తీసుకెళ్లిన కేసీఆర్ నాయకత్వానికి ప్రజలు ముమ్మాటికి బ్రహ్మారథం పడుతున్నారని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాలలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిని ఓట్లు అడగాలని, ఇందుకోసం 10 సంవత్సరాలలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రతి ఇంటి గడపకు తీసుకువెళ్లాలని పార్టీ ఇంఛార్జిలకు కేటీఆర్ సూచించారు. ప్రతిపక్ష పార్టీలకు ఎన్నికలు కేవలం హామీలు ఇచ్చేందుకు వేదికలు మాత్రమే అని బీఆర్ఎస్ పార్టీకి మాత్రం 10 సంవత్సరాలలో చేసిన ప్రగతిని ప్రజలకు వివరించే ఒక అద్భుతమైన అవకాశం అన్నారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీ పాలనలో సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుకున్న ప్రతి ఒక్కరితో మమేకం కావాలని పార్టీ నాయకులకు కేటీఆర్ సూచించారు.ఇంఛార్జిలుగా నియమించబడ్డ ప్రతి ఒక్క నాయకుడు ఇప్పటినుంచే పార్టీ విజయానికి అవసరమైన కార్యాచరణను, కార్యక్రమాలను చేపట్టాల్సిన బాధ్యత తీసుకోవాలని కేటీఆర్ ఆదేశించారు. రేపటి నుంచి ఎన్నికల ఫలితాలు వెలువడే రోజు వరకు ఆయా నియోజకవర్గాల సంపూర్ణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. (మిగతా 2లో..)

## భారత్ టాప్ బిలియనీర్ ముకేశ్ అంబానీ..

### రెండో స్థానానికి అదానీ




ముంబై: ప్రజాపాలన ప్రతినిధి:భారతీయ బిలియనీర్లలో రిలయన్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ మొదటి స్థానంలో నిలిచారని ప్రముఖ ఫోర్బ్స్ సంస్థ ఇండియా తెలిపింది. 2023 ఫోర్బ్స్ ఇండియా బిలియనీర్స్ జాబితాను గురువారం రిలీజ్ చేసింది. ఫోర్బ్స్. ముకేశ్ అంబానీతోపాటు వంద మంది అగ్రశ్రేణి కుబేరుల్లో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతం అదానీ, హెచ్‌సీఎల్ టెక్ ఫౌండర్ శివ్ నాడార్, ఓపీ జిందాల్ గ్రూప్‌నకు చెందిన సావిత్రి జిందాల్, అవెన్యూ సూపర్ మార్ట్స్ అధినేత రాధాకిషన్ ధమానీ తదితరులు ఉన్నారు.ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద 92 బిలియన్ డాలర్లు కాగా, గౌతం అదానీ 68 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో ఉన్నారు. మూడో స్థానంలో శివ్ నాడార్ సంపద 29.3 బిలియన్ డాలర్లు, సావిత్రి జిందాల్ 24 బిలియన్ డాలర్లు, రాధాకిషన్ దమానీ 23 బిలియన్ డాలర్లు, సైరస్ పూనావాలా 20.7 బిలియన్ డాలర్లు, హిందుజా ఫ్యామిలీ 20 బిలియన్ల డాలర్లు, దిలీప్ సంఘ్వీ 19 బిలియన్ డాలర్లు, కేఎం బిర్లా 17.5 బిలియన్ డాలర్లు, షాపూర్ మిస్త్రీ అండ్ ఫ్యామిలీ 16.9 బిలియన్ డాలర్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు.భారతదేశంలోనే అత్యంత సంపన్నురాలైన మహిళగా సావిత్రి జిందాల్ నిలిచారు. బిలియనీర్ల జాబితాలో కొత్తగా ఏడుగురికి చోటు లభించగా, బైజూస్ అధినేత బైజూ రవీంద్రన్ భార్య దివ్యా గోకుల్ నాథ్‌తోపాటు ఎనిమిది మంది.. ఫోర్బ్స్ ఇండియా టాప్ బిలియనీర్ల జాబితాలో చోటుకోల్పోయారు. 100 మంది బిలియనీర్లలో కొత్తగా లాండ్ మార్క్ చైర్ పర్సన్ రేణుకా జగతియానీ, ఏషియన్ పెయింట్స్ దానీ కుటుంబం, దుస్తుల ఎగుమతిదారు కేపీ రామస్వామి చేరారు. 40 ఏండ్ల వయస్సు గల జెరోదా ఫౌండర్ నిఖిల్ కామత్ అత్యంత చిన్న వాడు.

# ఈసీ నజర్..

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 20 బి ప్రకారం పరిశీలకుల నియామకం కొలిక్కి వచ్చింది. వీరు ఎన్నికల వ్యవస్థను అత్యంత సమీపంనుంచి పరిశీలిస్తారు.అయితే వీరు రిటర్నింగ్ అధికారుల పనితీరుపై కూడా పర్యవేక్షణ చేస్తారు. వీరు తాము గమనించిన అంశాలను నేరుగా కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తారు. పరిశీలకులు అనెగ్జర్ యం లేదా యస్ రూపంలో పంపే నివేదికలు కీలకమైనవి. ఎన్నికల పరిశీలకులకు ఓట్ల లెక్కింపును ఆపే అధికారం ఉంటుంది. వీటితోపాటు ఫలితాలను నిలిపివేసే అధికారం కూడా వీరు కల్గి ఉంటారు.

**వీరే కీలకం..**

రిటర్నింగ్ అధికారుల పాత్ర ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైనది. ఈసీ ఆదేశాల మేరకు వల్నరేబుల్ మ్యాపింగ్ సిద్దం చేసుకుని, శాంతి భద్రతలపై పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఎన్నికలు జరిపేందుకు స్టేషన్ల ఎంపికనుంచి వీరి కార్యాచరణ ప్రారంభమవుతుంది. చట్టసభలతోపాటు, స్థానిక ఎన్నికలకు రాష్ట్రంలో పరిస్థితులు సుగమయ్యాయి. ఈ ఏడాది నవంబర్ 30న ఎన్నికలు, డిసెంబర్ 3న ఫలితాల నేపథ్యం తర్వాత కూడా వరుస ఎన్నికలే జరగనున్నాయి.కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కూడా ఎన్నికల సందడి కొనసాగనుంది. వచ్చే ఏడాది మే నెలలో కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావాల్సి ఉన్న నేపథ్యంలో మళ్లి ఎన్నికలు అనివార్యమే. దీంతో జనవరి, ఫిబ్రవరినుంచే రాష్ట్రంలో మరోసారి ఎన్నికల వేడి ఆరంభం కానుంది. మే చివరి వరకు ఇది కొనసాగితే, గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, మున్సిపల్ పాలకమండళ్లకుకూడా ఈలోగా గడువు ముగియనుంది.ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది అంతా ఎన్నికల ఏడాదే కావడంతో మద్యం, నగదు భారీగా పారనుంది. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల నగదుకు కొదువ లేదని ఆదాయపు పన్ను శాఖ అంచనా వేస్తోంది. గడచిన 2014 ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో అత్యధికంగా రూ. 153కోట్లు పట్టుబడటమే ఇందుకు తార్కాణమని ఐటీ శాఖ అంచనాలు వేసుకుంటోంది. దేశంలోనే అత్యధిక ధన ప్రవాహం, నగదు పంపిణీ తెలుగు రాష్ట్రాలలో ఎక్కువగా ఉన్నట్లు గత లెక్కలు ధృవీకరిస్తున్నాయి.2014 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం, పోలీస్ శాఖలు, ఆదాయపు పన్ను శాఖ స్వాధీనం చేసుకున్న నగదు రూ. 313 కోట్లు కాగా రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయిన ఏపీ, తెలంగాణ ఉమ్మడిగా ఉన్న సమయంలో రూ. 153 కోట్లను సీజ్ చేశారు. 2018లో రూ. 230కోట్లను సీజ్ చేశారు. అయితే ఇదంతా కేవలం అధికారికంగా దాడుల్లో దొరికిందేనని, దొరక్కుండా ఓటర్లకు చేరింది, ఖర్చు చేసింది ఇంతకు వంద రెట్లకు పైనేని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. బ్యాంకులనుంచి అధిక మొత్తాల్లో నగదు ఉపసంహరణ, నగదు ఎక్కువగా పారుతున్న ప్రాంతాలపై ఆరా తీస్తున్నారు. అదేవిధంగా స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు, బంగారం, వెండి క్రయవిక్రయాలను నిశితంగా పరిశీలిస్తూ నిఘా తీవ్రతరం చేశారు. ఏ వ్యక్తి అయినా తన వ్యక్తిగత సేవింగ్స్ అకౌంట్‌లో రూ. 2.5 లక్షలకు మించి నగదును బ్యాంకులో డిపాజిట్ చేసినా, విత్‌డ్రా చేసినా ఆదాయపు పన్ను శాఖ కొన్ని వివరాలను కోరనుంది.నేరుగా ఖాతాదారుడికి నోటీస్‌లను పంపడం అందులో ఒకటికాగా సీక్రెట్ నిఘా ఇంకో విధానంగా ఉండనుంది. అన్ని బ్యాంకులకు చెందిన ఖాతాల్లోని అన్ ఆపరేటెడ్, గతంలో ఏనాడు పెద్ద మొత్తంలో నగదు జమ చేయని ఖాతాలపై ఆదాయపు పన్ను శాఖ దృష్టి పెట్టింది. బ్యాంకులు నగదు రవాణా వాహనాలను నిర్దేశిత సమయాల్లోనే నడిపించాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ)ని ఈసీ ఆదేశించింది.ఎన్నికల్లో అక్రమ నగదు రవాణాకు ఆ వాహనాలను వినియోగించే అవకాశం ఉందని గుర్తించినట్లు తెలిసింది. ఇక అంబులెన్సులు, ప్రభుత్వ వాహనాల్లో డబ్బు, ఇతర వస్తువుల అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేయాలని సంబంధిత యంత్రాంగాలను కోరింది. చీరలు, కుక్కర్లు వంటి ఎన్నికల్లో పంపిణీ చేసే కానుకలను నిల్వ చేసే ప్రైవేటు గోదాముల వద్ద గట్టి నిఘా పెట్టాలని రాష్ట్ర దర్యాప్తు సంస్థలను ఈసీ ఆదేశించింది.రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లతో పాటు ఎయిర్‌పోర్టులు, కార్గో ఫ్లయిట్లు, ప్రైవేటు ఎయిర్‌స్ట్రిప్‌లు, రాజకీయ నేతలు వినియోగించే వాణిజ్యేతర విమానాలు, ప్రత్యేక విమానాలు సైతం తనిఖీ చేసేందుకు అధికారం కట్టబెట్టింది. పేమెంట్ వ్యాలెట్ల ద్వారా జరిగే ఆన్‌లైన్ నగదు లావాదేవీలపై నిఘా పెట్టాలని ఆర్బీఐ, ఎస్ఎల్‌బీసీకి సూచనలు చేసింది. ఒకే ఖాతా నుంచి వందల సంఖ్యలోని ఖాతాలకు ఆన్‌లైన్ ద్వారా నగదు బదిలీ జరిగితే గుర్తించి విచారణ జరపాలని సూచనలు చేసింది.చిన్న చిన్న డ్రగ్ పెడ్లర్లపై చర్యలతోనే సరిపెట్టరాదని, పెద్ద మొత్తంలో మద్యం, మాదక ద్రవ్యాల సరఫరా, ఇతర అక్రమాలకు పాల్పడే కింగ్‌పిన్స్‌ను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఈసీ కోరింది. రాష్ట్ర సరిహద్దులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న 148 చెక్‌పోస్టులను సీసీటీవీ కెమెరాల ద్వారా కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరంగా పర్యవేక్షించనున్నారు. తెలంగాణలో ఈసారి అసెంబ్లీ ఎన్నికలు కొత్త రికార్డుల దిశగా కనిపిస్తున్నాయి.రాష్ట్రంలో త్రిముఖ పోరు జరగనున్న నేపథ్యంలో.. మూడు ప్రధాన పార్టీల మధ్య గట్టి పోటీ– నెలకొననుంది. ఎలాగైనా అధికారంలోకి రావాలని మూడు పార్టీలు శాయశక్తులా కృషి చేస్తున్నాయి. ఈ క్రమంలో ఓటర్లు ఆకర్షించేందుకు పెద్ద ఎత్తున నగదు, మద్యం, బంగారం, వెండి పంచేందుకు సిద్ధమయ్యారు నేతలు. అందుకోసం ఇప్పటి నుంచే వాటన్నింటినీ అక్రమంగా తరలించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి కూడా. తెలంగాణలో నవంబర్ 30వ తేది జరగనున్న తెలంగాణా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 9న ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగా.. ఆ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే.. కోడ్ అములులోకి వచ్చిన రోజు నుంచి.. హైదరాబాద్ సిటీ–పోలీస్ నగర వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేస్తూ అక్రమ నగదు, మద్యం, డ్రగ్స్‌తో పాటు– ఓటర్లను ప్రలోభ పెట్టే ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుంటు–న్నారు. ఇప్పటికే ఇవి రూ. 30కోట్లకు మించాయి.

# అభ్యర్థుల ఖర్చుల వివరాలు నమోదు చేయాలి



ఆసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 12 (ప్రజాపాలన,ప్రతినిధి) : శాసనసభ నియోజకవర్గ ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అకౌంటింగ్ టీం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల, 10వ తేదీ నామినేషన్ సమర్పించేందుకు ఆఖరు తేది అని,13న నామినేషన్ల పరిశీలన,15న అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరణ, 30వ తేదీన పోలింగ్, డిసెంబర్ 3వ తేదీన కౌంటింగ్ జరుగుతాయని, ఎన్నికల నిబంధనలు డిసెంబర్ 5వ తేదీ వరకు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణ కోసం భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేయలెన్స్ టీం, వీడియో సర్వేయలెన్స్ టీం, వీడియో పరిశీలన టీం, అకౌంటింగ్ టీమ్ లను నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 001-సిర్పూర్, 005–ఆసిఫాబాద్ నియోజకవర్గం జరగనున్న ఎన్నికలలో పోటీ చేయు రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఖర్చుల వివరాలను నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ద్వారా నిర్వహించు ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలు అన్నింటిని వీడియో సర్వేయలెన్స్ టీం సభ్యులు రికార్డింగ్ చేసి వీడియో పరిశీలన సభ్యుల ద్వారా సదరు వీడియో పరిశీలించి వివరాలను అకౌంటింగ్ టీం సభ్యులకు అందించడం జరుగుతుందని,అనంతరం పూర్తి వివరాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అకౌంటింగ్ టీం నోడల్ అధికారి, డి.టి.ఓ. రాజేశ్వర్, అకౌంటింగ్ టీం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తొలి ఉద్యమ జ్యోతి: ప్రొఫెసర్ జయశంకర్



చేవెళ్ల, అక్టోబర్ 12 (ప్రజాపాలన):తెలంగాణ ప్రజల్లో ఉద్యమ దివిటీని రగిలించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆజన్మ బ్రహ్మచారి అని ప్రొఫెసర్ జయశంకర్ సార్ మేనకోడలు జయశ్రీ శ్యాంసుందర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలో నూతనంగా ప్రతిష్టాపించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ జయశంకర్ మేనకోడలు జయశ్రీ శ్యాంసుందర్, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులతో కలిసి విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూవిద్యార్థి దశ నుంచి తన కళ్ళ ముందు జరుగుతున్న అన్యాయం పట్ల అసమానతల పట్ల ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఎదిరించి పోరాటం, చేసే వారని అన్నారు.ప్రత్యేక రాష్ట్రం కోసం 1969 సంవత్సరంలో జరిగిన తెలంగాణ తొలి దశ ఉద్యమంలో చురుకుగా పాల్గొని రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయం చూసి సహించేవాడు కాదనిఅన్నారు .తెలంగాణ ఏర్పాటు కొరకు రాష్ట్రంలోనే కాకుండా,ఇతర ప్రాంతాలలో,ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి తన ప్రసంగాలతో ప్రజలను చైతన్య వరుస్తూ ఉద్యమ దివిటిని రగిలించిన మహనీయుడనీ స్వరాష్ట్ర సాధన కోసం నిరంతరం చేసిన కృషి ఏనలేనిదని అన్నారు. రాష్ట్రం కోసం తన ఆస్తిని,జీవితాన్ని త్యాగం చేసి,ఆజన్మ బ్రహ్మచారిగా వుండి పోయారనీ, ఆయన తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్మణీయుడిగా నిలిచిపోయిన మహా మహా మనిషని, అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తూ, ఆయన గుజాడల్లో నడవాలని, కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి సర్పంచ్ శైలజ ఆగి రెడ్డి సున్నపు వసంతం గుండాల రాములు దేవర సమత వెంకట్ రెడ్డి ఎంపీటీసీలు సత్యనారాయణ చారి నరేందర్ చారి మిట్ట వెంకట రంగారెడ్డి పడాల వెంకటస్వామి బిజెపి నాయకులు అనంత్ రెడ్డి సిపిఐ రామస్వామి విశ్వకర్మ సంఘం గౌరవ అధ్యక్షులు లాలుకోట వెంకట చారి రాష్ట్ర అధ్యక్షులు వేములవాడ మన్మోహన్ చారి జిల్లా అధ్యక్షులు పులిగిల్ల శ్రీనివాస్ చారి జిల్లా కార్యదర్శి బ్రహ్మచారి ఉపాధ్యక్షులు లింగాచారి మాణిక్యం చారి రేణుక చారి బాలస్వామి మండల అధ్యక్షులు శ్రీనివాస చారి ఉపాధ్యక్షులు ఆనంద్ చారి ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ చారి కోశాధికారి వేణుగోపాల చారి యాదగిరి చారి మోనాచారి ఆంజనేయులు చారి ఆనందం చారి శేఖర్ చారి విశ్వకర్మ సంఘం యువ నాయకులు రవీందర్ చారి, శేఖర్ చారి శ్రీనివాస్ చారి రాజశేఖర్ చారి శివ చారి కుమార్ చారి బ్రహ్మచారి పవన్ చారి శివ చారి శ్రీధర్ చారి కొంపల్లి రాజు చారి జ్ఞానేశ్వర్ చారి నవీన్ చారి కృష్ణమాచారి మాధవాచారి నరేందర్ చారి పాల్గొన్నారు..

# బుల్లెట్ టూ బ్యాలెట్..

(మొదటి పేజీ తరువాయి)

రెండవ కొడుకు సమ్మయ్య సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. అప్పటికే వారి తల్లిదండ్రులు కనకమ్మ–మల్లయ్యలు కన్నుమూయడంతో మిగతా వారు సారయ్య, రవి, అశోక్‌లు విప్లవపంథాను ఎంచుకుని పీడిత ప్రజల నాలుకలలో నానుతున్నారు. పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడడానికి 1989లో అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరారు. అయితే అప్పుడు పోలీసుల నిర్బంధం, వేధింపులు, అణచివేత మూలంగా 1992లో గాజర్ల రవి అలియాస్ గణేష్, 1994లో గాజర్ల అశోక్ అలియాస్ ఐతులు కూడా అన్నల బాట పట్టారు.

మావోయిస్ట్ ఉద్యమంలో అమరులైన ఆజాద్, రమ

పీపుల్స్‌వార్‌లో చేరిన గాజర్ల సారయ్య అలియాస్ భాస్కర్ పేరిట చిట్యాల దళ కమాండర్‌గా పని చేసి అంచలంచెలుగా ఎదిగి పీపుల్స్‌వార్ నుంచి మావోయిస్టు పార్టీగా మారిన పార్టీ సెంట్రల్ కమిటీ మెంబర్‌గా, మిలటరీ ప్లాటూన్ కమాండర్‌గా పనిచేసి ఏటూరునాగారం అటవీప్రాంతం కంతనపల్లి అడవుల్లో 2008 ఏప్రిల్ 2న జరిగిన ఎన్‌కౌంటర్‌లో తన సహచరి రమతోపాటు ఊపిరి వదిలారు. ఆ ఎన్‌కౌంటర్ ఇప్పటికీ సంచలనంగా మిగిలిపోగా న్యాయ విచారణ సైతం కొనసాగింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చల ప్రతినిధిగా గణేష్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2004%--%05లో ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చలలో అప్పటి రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో కలిసి పార్టీ తరుపున ప్రతినిధిగా పాల్గొన్నారు గాజర్ల అశోక్ అలియాస్ గణేష్. అప్పటికే ఆయన ఆంధ్ర%--%ఒడిశా బార్డర్ కమిటీకి ప్రాతినిధ్యం వహిస్తుండడం గమనార్హం. అయితే అప్పటి ప్రభుత్వ విధానాలతో పార్టీకి పొసగకపోవడంతో తిరిగి మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లాడు. అయితే ప్రతిసారీ ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా గాజర్ల సోదరుల పేర్లు వినబడడం చిట్యాల ప్రాంత వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. మెరుపుదాడులు చేయడం, వ్యూహాత్మకంగా వ్యవహరించడంలో ముగ్గురు 'గాజర్ల' సోదరులు ఆరితేరిన వారుగా ఇప్పటికీ పార్టీలో, పోలీసు వర్గాలలో పేరుంది. కొద్దిరోజుల క్రితమే ఆరోగ్య కారణాలతో మావోయిస్టు పార్టీని వీడిన గాజర్ల అశోక్ కాంగ్రెస్ పార్టీలో చేరడం కీలకంగా మారింది. సరిగ్గా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యాక చేరడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఐసిస్ తరహాలో హమాస్‌నూ అణిచివేస్తాం: నెతన్యాహు

(మొదటి పేజీ తరువాయి)

నివసిస్తుండగా, మరికొందరు టూరిస్టులుగా ఇక్కడికి వచ్చారు.ఇజ్రాయెల్‌లో మారణహోమంతో కలత చెందిన వీరు స్వదేశానికి చేరుకుని తమ వారి చెంతకు చేరాలని తహతహలాడుతున్నారు. హమాస్ మెరుపుదాడుల అనంతరం తమ కుటుంబసభ్యులతో మాట్లాడానని హిమాచల్ ప్రదేశ్‌లోని కులు జిల్లాలో నివసిస్తున్న ఇజ్రాయెల్ మహిళ కెనెరియత్ గుర్తుచేసుకున్నారు. హమాస్ మిలిటెంట్ల బాంబు దాడితలో తమ ఇల్లు దగ్ధమైందని ఆమె చెప్పుకొచ్చారు. తన సోదరుడితో తాను మాట్లాడనని, తమ కజిన్ హమాస్ దాడిలో తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. భారత్‌లో తాము సురక్షితంగా ఉన్నా వీలైనంత త్వరలో ఇజ్రాయెల్ వెళ్లి కుటుంబసభ్యులను కలుసుకోవాలని ఉందని చెప్పారు. తమ స్వదేశం వెళ్లేందుకు తానెన్నడూ ఇంతగా భయపడలేదని అన్నారు. రాజస్థాన్‌లోని పుష్కర్‌ను సందర్శించిన ఇజ్రాయెలీ టూరిస్ట్ అమత్ తాను స్వదేశం వెళ్లి ఇజ్రాయల్ రక్షణ బలగాల్లో చేరి హమాస్ ఉగ్రవాదులతో పోరాడతానని చెప్పాడు. మహిళలు, చిన్నారులు, సైనికులపై హమాస్ చేపడుతున్న దాడులను తిప్పికొట్టేందుకు ఈనెల 15న ఇజ్రాయెల్‌కు తిరుగుముఖం పట్టనున్నట్టు అమత్ తెలిపాడు.

**ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం.. ఇరాన్‌కు అమెరికా వార్నింగ్..!**

ఇజ్రాయెల్ – హమాస్ మధ్య యుద్ధం కొనసాగుతున్నది. అయితే, హమాస్‌కు ఇరాన్ సహకారం అందిస్తుందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇజ్రాయెల్‌కు అమెరికా సైనిక సహాయం, అమెరికా యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలను మోహరిస్తున్నది. ఈ క్రమంలో ఇరాన్‌ను జాగ్రత్తగా ఉండాలని బైడెన్ హెచ్చరించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూతో బుధవారం మాట్లాడినట్లు తెలిపారు. యుద్ధ నిబంధనల ప్రకారం ఏవైనా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

**40 మంది చిన్నారుల్ని నరికేశారు: ఐడీఎఫ్**

హమాస్ మారణహోమం సృష్టిస్తోంది. వేలాది మంది ఇజ్రాయిల్ ప్రజల్ని చంపేస్తోంది. కిబుజిమ్‌లో హమాస్ ఫైటర్లు బీభత్సం సృష్టించారు. మహిళలు, చిన్నారులు, పసిపిల్లలు, వృద్ధుల్ని అత్యంత కిరాతకంగా చంపేస్తున్నారు. ఇస్లామిక్ ఉగ్రవాదుల తరహాలో హమాస్ తీవ్రవాదులు రెచ్చిపోతున్నారు. కిబుజిమ్‌లో సుమారు 40 మంది చిన్నారుల్ని హమాస్ నరికివేసినట్లు ఇజ్రాయిల్ రక్షణ దళాలు పేర్కొన్నాయి. పసి పిల్లలను చంపేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, హమాస్ ఇలాంటి దాడులకు పాల్పడుతుందని తొలుత నమ్మలేదని, కానీ సాక్ష్యులు చెబుతున్న విషయాలు భయానకంగా ఉన్నట్లు ఐడీఎఫ్ ప్రతినిధి జోనాథన్ కన్‌రికస్ తెలిపారు. మహిళలు, చిన్నారుల చేతులకు సంకెళ్లు వేసి నరికివేస్తున్నారని ఆయన అన్నారు. హమాస్ క్రూరత్వానికి ప్రపంచానికి చూపేందుకు.. కిబుజిమ్ ప్రాంతానికి అంతర్జాతీయ జర్నలిస్టులను తీసుకువెళ్లారు.

# ఆస్ట్రేలియాకు ఘోర పరాభవం

(మొదటి పేజీ తరువాయి)

వన్‌డౌన్ బ్యాటర్ రాసీ వాన్ డెర్ డసెన్ 26 పరుగులతో రాణించగా.. ఆ తర్వాతి స్థానాల్లో బ్యాటింగ్ చేసిన ఎయిడెన్ మార్కరమ్(56), హెన్రిచ్ క్లాసెన్ 29 పరుగులు రాబట్టారు. మార్కో జాన్సెన్ 26 పరుగులు సాధించాడు.ఈ క్రమంలో నిర్ణీత 50 ఓవర్లలో ప్రొటిస్ జట్టు 7 వికెట్ల నష్టానికి 311 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లలో పేసర్ మిచెల్ స్టార్క్, ఆఫ్ బ్రేక్ స్పిన్నర్ గ్లెన్ మాక్స్‌వెల్ రెండేసి వికెట్లు తీయగా.. కెప్టెన్, స్పీడ్‌స్టర్లు ప్యాట్ కమిన్స్, జోష్ హాజిల్‌వుడ్, స్పిన్నర్ ఆడం జంపా ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.ఆస్ట్రేలియా అంటే పూనకాలే, ప్రపంచకప్‌లో చరిత్ర సృష్టించిన క్వింటన్ డికాక్, పలు రికార్డులు బద్దలు కొట్టిన సౌతాఫ్రికా ఓపెనర్312 పరులు విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ఏ దశలోనే పోటీ ఇవ్వలేదు. 17 ఓవర్లలో 70 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది.పేసర్ కగిసో రబడ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో 71 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన కంగారూ జట్టు కష్టాల్లో కూరుకుపోయింది.ఆరో ఓవర్ ఐదో బంతికి మిచెల్ మార్ష్(7)ను మార్కో జాన్సెన్ అవుట్ చేయడంతో మొదలైంది ఆసీస్ వికెట్ల పతనం. ఆ తర్వాత ఎంగిడి బౌలింగ్‌లో డేవిడ్ వార్నర్(13), రబడ బౌలింగ్‌లో స్మిత్(19) ఎల్బీడబ్ల్యూ, జోష్ ఇంగ్లిస్‌ను బౌల్డ్ కాగా.. మహరాజ్ బౌలింగ్‌లో మాక్స్‌వెల్(3) క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరిగాడు.ఆ తర్వాత మళ్లీ రంగంలోకి దిగిన రబడ స్టొయినిస్(5)ను అవుట్ చేయడంతో ఆసీస్ కష్టాల్లో కూరుకుపోయింది. ఇలాంటి దశలో మార్నస్ లబుషేన్‌కు తోడుగా టెయిలెండర్ మిచెల్ స్టార్క్(51 బంతుల్లో 27 పరుగులు) పట్టుదలగా క్రీజులో నిలబడిన వేళ మార్కో జాన్సెన్ దెబ్బకొట్టాడు. ఆ వెంటనే 46 పరుగులతో నిలకడగా ఆడుతున్న లబుషేన్‌ను కేశవ్ మహరాజ్ పెవిలియన్‌కు పంపాడు.ఆఫ్ఘనిస్థాన్ మ్యాచులో బౌండరీ లైను వద్ద శార్దూల్ ఠాకూర్ పట్టిన క్యాచ్ చూస్తే ఊపిరి ఆగిపోవడం ఖాయం..ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ ప్యాట్ కమిన్స్.. నాలుగు బౌండరీల సాయంతో 22 పరుగులతో నిలదొక్కుకునే ప్రయత్నం చేశాడు. అయితే, 41వ ఓవర్ మూడో బంతికి తబ్రేజ్ షంసీ బౌలింగ్‌లో కమిన్స్ ఇచ్చిన క్యాచ్‌ను మిల్లర్ ఎలాంటి పొరపాటు చేయకుండా ఒడిసిపట్టాడు. దీంతో షంసీ ఖాతాలో వరల్డ్‌కప్ క్రికెట్‌లో తొలి వికెట్ చేరింది. అదే ఓవర్లో హాజిల్‌వుడ్‌ను కూడా షంసీ అవుట్ చేయడంతో ఆసీస్ కథ ముగిసిపోయింది. 177 పరుగులకే ఆలౌట్ కావడంతో సౌతాఫ్రికా చేతిలో ఏకంగా 134 పరుగులు భారీ తేడాతో ఓడి ఘోర పరాభవం మూటగట్టుకుంది. ప్రొటిస్ పేసర్లలో రబడకు మూడు, జాన్సెన్‌కు రెండు, లుంగి ఎంగిడికి ఒక వికెట్ దక్కగా.. స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, తబ్రేజ్ షంసీ చెరో రెండు వికెట్లు తీశారు.

# కేసీఆర్ నాయకత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు : మంత్రి కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ శ్రేణులు అన్నింటిని సమన్వయం చేసుకొని పార్టీ ప్రచార బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు కేటీఆర్. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ ఇంఛార్జిలకు పలు సలహాలు, సూచనలు అందించారు. రానున్న 45 రోజుల పాటు నియోజకవర్గంలోనే ఉంటూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అన్ని విధాల సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల నిర్వహణ మొదలుకొని నియోజకవర్గ స్థాయి వరకు అన్ని దశల్లో పార్టీ ప్రచారం పకడ్బందీగా ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని సూచించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధిస్తుందని తెలిపిన హరీష్ రావు ఆ దిశగా ఈ 45 రోజులపాటు విస్తృతంగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

## పత్తి కొనుగోలుకు సి సి ఐ, జిన్నింగ్ మిల్లులు సిద్ధంగా ఉండాలి




అసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 11 (ప్రజాపాలన,ప్రతినిధి) : జిల్లాలో పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ట్లో జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో వ్యవసాయ, మార్కెటింగ్, సి సి ఐ అధికారులు, రవాణా శాఖ, అగ్నిమాపక శాఖ, కొలతలు తూనికలు శాఖ, జిన్నింగ్ మిల్లుల యజమానులతో పత్తి కొనుగోలు ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు కార్యక్రమం ప్రారంభం కాబోతున్న సందర్భంగా కొనుగోలుదారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిన్నింగ్ మిల్లుల యజమానులు ప్రభుత్వం ప్రకటించిన నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పత్తి దిగుబడి ఇతర రాష్ట్రాలకు తరలించడం కానీ, దిగుమతి చేసుకోవడం కానీ అనుమతి లేకుండా, ఆ దిశగా రవాణా శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొలతలు తూనికల అధికారులు ఎలక్ట్రానిక్ కాంటాలను తనిఖీ చేయాలని, రైతులు తమ ఆధార్ అనుసంధానం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రైతుల సౌకర్యార్థం జిల్లాలోని ఆసిఫాబాద్, వాంకిడి, కొండపల్లి, జైనూర్, కౌటాల, ప్రాంతాలలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కొనుగోలు కేంద్రాల పరిధిలో 16 మిల్లులను గుర్తించడం జరిగిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కనీస మద్దతు ధరతో లబ్ధి పొందాలని తెలిపారు. ఈ సమీక్షలో మార్కెటింగ్ అధికారి గజానంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా రవాణా అధికారి గంధం లక్ష్మి, సీసీఐ, అగ్నిమాపక శాఖ అధికారులు, జిన్నింగ్ మిల్లులో యజమానులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### శంకరపట్నంలో తెలంగాణ ముస్లిం డిక్లరేషన్ సంకల్ప సభ

శంకరపట్నం అక్టోబర్ 12 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో గురువారం నిర్వహించిన తెలంగాణ ముస్లిం డిక్లరేషన్ సంకల్ప సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ముస్లింల అభివృద్ధికి ఐక్యతకు సమిష్టిగా పోరాడాలని ప్రసంగించారు. 22 డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం జె.ఎ.సి కన్వీనర్ సయ్యద్ సలీమ్ పాషా, కో- కన్వీనర్ సైబాబా, ప్రొఫెసర్ సయ్యద్ అన్సారీ, జిల్లా జె.ఎ.సి కన్వీనర్ సయ్యద్ రసూల్, మండల ముస్లిం జె.ఎ.సి కన్వీనర్ మహమ్మద్ రహీం, మండల టి.డి.పి మండల అద్యక్షుడు సయ్యద్ ఆరిఫ్, కేశవపట్నం మజిద్ సదర్ జాకీర్ ఖాజా మొయినోద్దీన్, కాంగ్రెస్ మండల మైనారిటీ అధ్యక్షుడు ఎండీ జహంగీర్, కాంగ్రెస్ మండల యువత అద్యక్షుడు ఎండి హిజాముద్దీన్, అన్ని గ్రామాల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ఎం.బి.సి.లను ప్రత్యేకంగా ఆదుకున్న ఘనత సీఎం కేసీఆర్ దే




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి): బీసీ లలో అత్యంత వెనుకబడిన వర్గాలను (ఎంబిసి లను) గుర్తించి ప్రత్యేకంగా చేయూతను అందించడం సీఎం కేసీఆర్ లోని మానవీయ ధృక్పదానికి నిదర్శనం అని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఒక మేదర కులానికి చెందిన ప్రజా ప్రతినిధి అయిన నందికంటి శ్రీధర్ ను రాష్ట్ర ఎంబిసి ఆర్థిక సహకార కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమించడం రాష్ట్ర ప్రభుత్వ ఉదాత్త లక్షణాన్ని కనబరుస్తుందని డాక్టర్ వకుళాభరణం అన్నారు. గురువారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నందికంటి శ్రీధర్ కు ఆత్మీయ సన్మానం జరిగింది. ఎం.బి.సి., డి.ఎన్.టి. సంఘాల ప్రతినిధులు ఈ అభినందన సభను సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, ఆత్మీయ అతిధులుగా కమిషన్ సభ్యులు సి.హెచ్. ఉపేంద్ర, శుభ్రప్రద్ పటేల్ నూలి, కె. కిశోర్ గౌడ్, జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి లు పాల్గొని ప్రసంగించారు. సభాధ్యక్షులుగా మేధర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మురళి కృష్ణ వ్యవహరించారు.

ఈ సందర్భంగా డాక్టర్ వకుళాభరణం మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతున్నదని పేర్కొన్నారు. అమలులో ఉన్న ప్రతి సంక్షేమ పథకం పేద వర్గాల కుటుంబాలలో వెలుగును నింపుతున్నాయని అన్నారు. గత 10 ఏళ్ళలోపే పేద వర్గాల జీవన ప్రమాణాలలో ఊహించని ప్రగతి స్పష్టంగా అగుపించడం గమనించదగింది అన్నారు. సి.హెచ్. ఉపేంద్ర మాట్లాడుతూ... ఎంబిసి లుగా '%ూ%' గ్రూపులోని 36 కులాలను ప్రత్యేకంగా గుర్తించి, జాబితా రూపొందించి పూర్తి శాతం గ్రాంట్ లతో ఆర్థికంగా ఆదుకోవడం రాష్ట్రంలో గొప్ప పరిణామం అన్నారు. సీఎం కేసీఆర్ పదవుల ఎంపికలలో పాటిస్తున్న విధానం భవిష్యత్ లో కూడా పాటించదగిన ఒక స్ఫూర్తివంతమైన తీర్పుకు బాటలు వేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎం.బి.సి. అధ్యక్షుడు బెక్కం వెంకట్, బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగ్యం సూర్యారావు, వీరభద్రీయ సంఘం నాయకుడు వీరాస్వామి, సంచార కులాల సంఘం జాతీయ అధ్యక్షుడు. నరహరి, మేధర సంఘం రాష్ట్ర నాయకులు ప్యారసాని బాలరాజ్, వెంకట రాములు, ఆర్యకటిక సంఘం నాయకుడు నేతీకార్ ప్రేమ్ లాల్, గంగిరెద్దుల సంఘం నాయకుడు నరసింహం, మేరు సంఘం నాయకుడు మాధవ్, వివిధ బీసీ, ఎం.బి.సి. ప్రజా, కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఈ అభినందన సభలో పాల్గొని ప్రసంగించారు, నందికంటి శ్రీధర్ ను అభినందించారు.

# దళిత బంధు తో బిఆర్ఎస్ గెలుపు సాధ్యమేనా?

**మండలంలో కాంగ్రెస్ ను చెక్ పెట్టాలనే ఉద్దేశంతోనే దళిత బంధు పథకం అని విమర్శలు**

**నియోజకవర్గంలో మిగతా 3 మండలాల దళితుల పరిస్థితి ఏమిటని చర్చ**

**చివరికి ఈ దళిత బంధు ఎటువైపు దారితీస్తుందో వేచి చూడాల్సిందే..?**



బోనకల్, అక్టోబర్ 12 ప్రజా పాలన ప్రతినిధి : దళితులకు ప్రకటించిన దళిత బంధు పథకంతో బిఆర్ఎస్ గెలుపు సాధ్యమేనా అంటూ మండలంలో జోరుగా చర్చ నడుస్తుంది. తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు దళితులతో పాటు బోనకల్ మండలం చుట్టూ తిరుగుతున్నాయి. సీఎం కేసీఆర్ ఉన్నట్టుండి దళితులపై ప్రేమను ఒలకబోస్తున్నారు. ఆయనతో సహా అన్ని పార్టీల నాయకులు దళితుల గురించి మాట్లాడుతున్నారు. అందరూ దళిత రాగం ఎత్తుకునేసరికి దళితులకు, ఎన్నికలకు సంబంధం ఏంటనే చర్చ మొదలైంది. గతంలో జరిగిన ఏ ఎన్నికలో కూడా ఏ నాయకుడు వారి గురించి ఇంత ప్రేమ చూపలేదంటూ పలువురు అంటున్నారు. ఇతర పార్టీలు ఇప్పుడు వారిపై మమకారం చూపడం ఆసక్తిగా మారింది. మధిర నియోజకవర్గం పై పట్టు పెంచుకునేందుకు బిఆర్ఎస్ నాయకులు శరవేగంగా పావులు కదుపుతున్నారు. రాజకీయ జిమ్మిక్కుల్లో భాగంగానే బోనకల్ మండలానికి దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చారని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ టక్కుటమార విద్యలు బిఆర్ఎస్ ఆధిపత్యం వర్సెస్ కాంగ్రెస్ అస్తిత్వం అన్నట్టుగా కనిపిస్తోంది. బోనకల్ మండలంలో ఎలాగైనా కాంగ్రెస్ ను చెక్ పెట్టాలనే లక్ష్యంతోనే దళిత బంధు పథకాన్ని మండలానికి తీసుకొచ్చారనే విమర్శలు వస్తున్నాయి. ఈ పథకంతో బిఆర్ఎస్ పార్టీ దళితులకు దగ్గర కావాలని చూస్తుందని మండలంలో పలువురు చర్చించుకుంటున్నారు. మధిర నియోజకవర్గ రాజకీయాలను కులం కోణంలో చూస్తే ఇరు పార్టీల అభ్యర్థులు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారే. ఈ పరిస్థితిలో ఎస్సీ ఓటర్లపై ఇరు పార్టీల నాయకులు దృష్టి పెట్టారు. దళితుల ఓట్లను అధికారికంగా కొనుగోలు చేయడంకోసమే దళిత బంధు పథకాన్ని తీసుకువచ్చారనే విశ్లేషణలు ఉన్నాయి. మధిర నియోజకవర్గంలో మొదటి విడత లో చింతకాని మండలానికి దళిత బందు వచ్చిన మాట వాస్తవమే. ఇప్పుడు ప్రభుత్వం బోనకల్ మండలానికి దళిత బంధు పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించిన మాట వాస్తవమే. నియోజకవర్గంలో మధిర, ఎర్రిపాలెం, ముదిగొండ ఈ 3 మండలాల దళితుల పరిస్థితి ఏమిటని చర్చ జోరుగా నడుస్తుంది. బిఆర్ఎస్ ఓట్ల రాజకీయాలు చేస్తూ, అధికారాన్ని ఎలా కాపాడుకోవాలని తప్ప ప్రజల బాగుకోసం పనిచేయబోరని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు. ఇంతకుముందు దళితులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండానే ఇలాంటి ఎన్నికల స్కీంతో రావడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు. ఇప్పుడు బిఆర్ఎస్ దళిత బంధు అంటూ మండలంలో దళితులను మభ్యపెడుతోందని విమర్శిస్తున్నారు. ఇలా పార్టీలు, నాయకుల హడావుడి మండలంలో జోరుగా సాగుతుందని రాజకీయ విశ్లేషణకులు అంటున్నారు. ఈ విధంగా దళితులను ఓటు బ్యాంకుగా మలుచుకునేందుకు నాయకులు దళిత బందు పథకం పేరు వాడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ పథకంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఎలాగైనా మధిర గడ్డపై గులాబీ జెండా ఎగరవేయాలని బిఆర్ఎస్ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని చర్చించుకుంటున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపు ఖాయమనే ధీమా ఆ పార్టీ నాయకులలో కనిపించడంలేదనే విమర్శలు మండలంలో మెండుగా వస్తున్నాయి. చివరికి ఈ దళిత బంధు పథకం ఎటువైపు దారితీస్తుందో వేచి చూడాల్సిందే.?

# ఎన్నికల ప్రకటనలకు ఎం.సి.ఎం.సి. అనుమతి తప్పనిసరి

**మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు**

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**



మంచిర్యాల బ్యూరో, అక్టోబర్ 12, ప్రజాపాలన :శాసనసభ నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణలో భాగంగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారం సంబంధిత ప్రకటనలు చేయాలంటే ఎం.సి, ఎం.సి. అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎన్నికల నిర్వహణలో భాగంగా ఫిర్యాదుల నిర్వహణ సెల్, కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ – మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ విభాగాలను, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాసనసభ నియోజకవర్గాల ఎన్నికలలో భాగంగా నవంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల, 10వ తేదీ నామినేషన్ సమర్పించేందుకు ఆఖరు తేది అని, 13న నామినేషన్ల పరిశీలన, 15న అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరణ, 30వ తేదీన పోలింగ్, డిసెంబర్ 3వ తేదీన కౌంటింగ్ జరుగుతాయని తెలిపారు. ఐతే ఎన్నికల నిబంధనలు డిసెంబర్ 5వ తేదీ వరకు అమలులో ఉంటాయని తెలిపారు.

**మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు**

ఈ క్రమంలో ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎప్పటికపుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. , ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎం.సి.ఎం.సి. కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం జరుగుతుందని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రకటనల కొరకు అందిన దరఖాస్తులను పరిశీలించి సకాలంలో అనుమతి మంజూరు చేయాలని అన్నారు. శాటిలైట్/కేబుల్ ఛానెల్స్లో వార్తలను పూర్తి స్థాయిలో రికార్డు చేయాలని ఆదేశించారు. వార్తా పత్రికలు, ఈ-పేపర్లు, టెలివిజన్ ఛానెల్లు, స్థానిక కేబుల్ నెట్వర్క్, సోషల్ మీడియా, మూవీ హౌస్లు, ఎస్.ఎం.ఎస్.లు ఇతర ఆడియో, వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎం.సి.ఎం.సి. నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల సంబంధిత పిర్యాదుల కొరకు కంట్రోల్ రూమ్తో పాటు టోల్ ఫ్రీ నెంబర్ 1950, 08736-250504 ను ఏర్పాటు చేయడం జరిగిందని, 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా జరుగడంలో మీడియా కీలకపాత్ర అని, ఎన్నికలకు సంబంధించిన ఎటువంటి సమాచారం అయినా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, జిల్లా కార్మిక శాఖ సహాయ కమీషనర్ ఎ.ఎస్. వినీత, ఎం.సి.ఎం.సి. నోడల్ అధికారి, జిల్లా పౌరసంబంధాల అధికారి వై. సంపత్ కుమార్, ఎన్నికల విభాగం తహశిల్దార్ శ్రీనివాస్, అధికారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## లింగాపూర్ లో బి.ఆర్.ఎస్ పార్టీ బూత్ స్థాయి సమావేశం



శంకరపట్నం అక్టోబర్ 12 ప్రజాపాలన రిపోర్టర్:శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బి.ఆర్.ఎస్ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగడంతో రానున్న రోజుల్లో గ్రామ గ్రామాన పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలనీ పిలుపునిచ్చారు.

## పాఠశాల విద్యార్థుల బతుకమ్మ సంబరాలు



శంకరపట్నం అక్టోబర్ 12 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండలం కేంద్రంలోని కృష్ణ వేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు గురువారం బతుక మ్మ సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు వివిధ రకాల వేషాధారణలతో అలంకరించుకొని బతుకమ్మ ఆడారు. దసరా సెలవుల నేపథ్యంలో ముందస్తుగానే పాఠశాలల్లో బతుకమ్మ ఆడుతూ ఉత్సాహంగా తెలంగాణ ఖ్యాతిని చాటారు. విద్యార్థులు ర్యాలీగా వెళుతూ ప్రధాన కూడలిలలో తమ విన్యాసాలు ఆటపాటలతో చూపరులను ఆకట్టుకున్నారు.












జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

శుక్రవారం 13,అక్టోబరు 2023

# మోడీ 'స్వచ్ఛ భారత్' ఓ పగటి కల

రైతు శ్రమలాగానే పారిశుధ్య శ్రమ కూడా మన దేశంలో విస్మరణకు గురౌతున్నది. ఈ రెండు శ్రమలూ అమూల్యమైనవి. ఒకటి ఆహార భద్రతను కల్పిస్తే మరొకటి ఆరోగ్య భద్రతను కల్పిస్తుంది. పరిశుభ్రత లేకుండా ప్రజారోగ్యం ఉండదు. లక్షల రూపాయల జీతం ఇస్తామన్నా పారిశుధ్యం, సఫాయి పనులకు చాలామంది ముందుకు రారు. ఎందుకంటే ఆ దుర్గంధ దుర్భర పరిస్థితులను భరించడం, వాటి మధ్యన పనిచేయడం కష్టసాధ్యం. స్వతంత్ర భారతావని అమృతోత్సవ వేడుకలు (75 ఏళ్ళు) జరుపుకుంటున్న ఈ తరుణంలో సైతం దేశవ్యాప్తంగా ఇంకా 20 లక్షల మందికి పైగా సఫాయి కార్మికులు మానవ మల మూత్రాలను చేతులతో తట్టలతో ఎత్తి పారబోయడం, మ్యాన్‌హోల్స్‌లో పూర్తిగా దిగబడి మురికిని తొలగించడం ఎంతటి నరకప్రాయమో ఊహించుకోవచ్చు. దీనినే అమానవీయ సఫాయి పని (ఇన్‌హ్యూమన్ స్కావింజర్స్ వర్క్) అని కూడా అంటున్నారు. పాలకుల చిత్తశుద్ధి, రాజకీయ సంకల్పంతో కూడిన విధివిధానాలే పారిశుధ్య పనికి న్యాయం చేయగలవు తప్ప పైపై నాటకాలు ఎంత ఆడితే మాత్రం ఏం ప్రయోజనముంటుంది?'స్వచ్ఛ భారత్–స్వాస్థ భారత్' అంటూ ప్రధాని మోడీ మరలా చీపురు పట్టారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మొన్నటికి మొన్న 'స్వచ్ఛత కీ సేవా' కార్యక్రమంలో వినూత్నంగా ఫిట్‌నెస్ ఆరోగ్య సంరక్షణను జతచేశారు. ఇందుకు సంబంధించి ఫిట్‌నెస్ నిపుణుడు అంకిత్ బైయాన్ పూరియాను కలుపుకున్నారు. ప్రధాని పిలుపు మేరకు దేశమంతటా జరిగిన కార్యక్రమంలో లక్షలాది మంది స్వచ్ఛందంగా పాల్గొన్నట్టు మీడియా తెలిపింది. బస్టాండ్లు, మార్కెట్లు, రహదారులు, జలవనరులు, తీరప్రాంతాలు, బడులు, గుడులు, గోశాలలు వీరు శుభ్రపరిచిన ప్రాంతాలు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ తన అధికార ప్రచారం 'ఎక్స్'లో ఈ విధంగా షేర్ అయింది. 'నేడు దేశమంతా స్వచ్ఛతపై దృష్టి పెట్టింది. నేను బైయాన్ పూరియా కలిసి స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్నాం. కేవలం పరిసరాలను శుభ్రపరచడమే కాదు. ఫిట్‌నెస్, ఆరోగ్యం కూడా ముఖ్యం. ఇదంతా స్వచ్ఛ భారత్ స్వాస్థ భారత్ కోసమే' అని ప్రధాని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని అదే మీడియా తెలిపింది. కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, పార్టీ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, స్వచ్ఛంద కార్యకర్తలు...ఓ%ఎ% ఒకరేమిటి ఇలా ఎంతోమంది రంగంలోకి వచ్చి చీపుర్లకు పని చెప్పారట. ప్రైవేటు కంపెనీలు, ధార్మిక సంస్థలు కూడా ఈ శ్రమదానంలో పెద్ద ఎత్తున పాల్గొనడం విశేషమని వివరించింది. దేశాన్ని పరిశుభ్రంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం తీర్మనించుకున్నదని, ఇదొక సవాలు, సాహసమని, చెత్త రహిత భారత్ అనే కలను సాకారం చేసుకుందామని, క్రికెట్ లీడరు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు కూడా ఇందుకు మద్దతు ఇచ్చారనీ...! ఇలా ఇలా ఊదరగొట్టింది. నిజమే. అయితే స్వచ్ఛ భారత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా గాంధీని (చీపురు పట్టుకున్న గాంధీ చిత్రంతో సహా) ఉపయోగించుకుంటున్న బి.జె.పి. పారిశుధ్యం కృషిలో గాంధీ అభిప్రాయాలకు ఏమైనా విలువిస్తుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. 'మనకు స్వేచ్ఛా భారత్ ఎంత ముఖ్యమో స్వచ్ఛ భారత్ అంతే ముఖ్యం' అని గాంధీజీ నిరంతరం నినదించాడు. పారిశుధ్యం పనిని పుణ్యకార్యంగా భావించాలని తనదైన శైలిలో చెప్పాడు. నమ్మాడు, ఆచరించాడు. స్వహస్తాలతో దొడ్లు శుభ్రపరిచి ఆరాధ్యుడయ్యాడు. స్వాతంత్ర్యానంతరం మన భారత్ పచ్చని ప్రకృతి, పంట పొలాలతో నిత్యం శోభిల్లాలని ఆకాంక్షించాడు.కారణం ఏదైతేనేం...స్వచ్ఛత వైపు మరో అడుగు అంటూ ప్రధాని అయిన కొత్తలోనే మోడీ 2014 లోనే స్వచ్ఛ భారత్ మిషన్ (క్లీన్ ఇండియా మిషన్) ప్రారంభించారు. ఈ మిషన్ ఓ ప్రతిష్టాత్మక పథకమని కూడా అప్పుడు చెప్పుకొచ్చారు. 2014–19 ఐదేళ్ల కాలంలో 62 వేల కోట్ల రూపాయల నిధులతో నాలుగు వేల పట్టణాలకు పారిశుధ్య సేవలను అందించ నున్నట్టు ప్రకటించారు. 2019 అక్టోబరు 2 మహాత్మా గాంధీ 150వ జయంతికల్లా భారత్‌ను బహిరంగ మల మూత్ర విసర్జనా రహిత దేశంగా మార్చనున్నట్టు తెలిపారు. గ్రామాలలో కటతం కమ్యూనిటీ, వ్యక్తిగత టాయిలెట్ల నిర్మాణానికి తోడ్పడి ఓ.డి.ఎఫ్ (ఓపెన్ డెఫెకేషన్ ఫ్రీ) సాధిస్తామని పేర్కొన్నారు. ఇదో స్వచ్ఛతా ఉద్యమం అని పేర్కొంటూ అమితాబ్ బచ్చన్, అమీర్ ఖాన్, సచిన్ టెండుల్కర్, సానియా మీర్జా వంటి ప్రముఖుల్ని ఎందరినో రంగంలోకి దింపారు. మరేమైంది? మోడీ ప్రధానిగా ఉన్న ఈ పదేళ్లలో స్వచ్ఛ భారత్ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది. కథ మళ్ళీ మొదటికి వచ్చినట్టు అర్థమయింది. గ్రామాల్లో, నగరాల్లో ఎక్కడ తిరిగినా ఎవరికి వారికి ఇది ప్రత్యక్ష అనుభవ సత్యం. ఎక్కడబడితే అక్కడ చెత్త చెదారం, మురికి తాండవిస్తూనే ఉన్నది. నగరాలు, పట్టణాలు, గ్రామాలు ఎక్కువ భాగం బహిరంగ మల విసర్జన ప్రాంతాలుగా కన్పిస్తూనే ఉంటాయి. అసలు దేశంలో సగం కుటుంబాలకు మాత్రమే (49 శాతం) మెరుగైన పారిశుధ్య సేవలు అందుతున్నాయని జాతీయ కుటుంబ సర్వే తెలిపింది. ముఖ్యంగా పేదరికంతో మురికి జతకూడి ఉంటుందనే విషయం మనం మరువరాదు. నగరాలు, పట్టణాల్లో మురికివాడలు పెరుగుతూనే ఉన్నాయి. గ్రామాలు దారిద్ర్యంతో అల్లాడుతూనే ఉన్నాయి. మురికిని తొలగించాలంటే ముందుగా పేదరిక నిర్మూలన జరగాల్సిందే. ఇందులో రెండో అభిప్రాయానికి తావు లేదు, పేదలకు తాగు నీరే కరువైనప్పుడు టాయిలెట్ల నిర్మాణంతో వారికి పని ఏమి? మిషన్ యాటిట్యూడ్ (దృక్పథం) అంటే తాను నిర్విరామంగా చేస్తూ ఇతరులచే ఆ పని చేయించడం, గాంధి కృషి ఆ విధంగా ఉంది గనుకనే ప్రజా నాయకుడయ్యాడు.ప్రపంచంలో ఏ దేశంలో లేనంతగా మన దేశం మానవ వనరులతో అలరారుతున్నది. చిత్తశుద్ధితో కృషి చేసినపుడు ఏదీ సాధ్యం కాకమానదు. చెత్త, మురికి ఎక్కువగా పేరుకు పోవడానికి ప్రధాన కారణం ప్లాస్టిక్ ఉత్పత్తులు, వాటి వాడకం. వాటిని నియంత్రించడంలో ప్రభుత్వ విధి విధానాలు తోడ్పడాలి తప్ప అది అదే, ఇది ఇదే అన్నట్టు వ్యవహరిస్తే చివరకు స్వచ్ఛ భారత్ శ్రమదానం ఓ ఫార్స్‌గా, మొక్కుబడి కార్యక్రమంగా మిగిలిపోతుంది. ఇప్పుడు జరుగుతున్నది అదే. అలాగే పచ్చదనం అడవుల పెంపకానికి, ప్రకృతి సంరక్షణకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పనా చర్యలు చేపట్టాలి. పౌరుల దైనందిన జీవనంలో పచ్చదనం–పరిశుభ్రత అంతర్భాగం అయ్యేలా ఎక్కడికక్కడ నిర్దిష్ట ప్రణాళికలు రచించి అమలు పరచాలి. ప్రజాస్వామ్య పద్ధతుల్లో అందర్నీ భాగస్వాముల్ని చేయాలి. నాయకుడు ముందుండి నడిపించాలి. లేని పక్షంలో స్వచ్ఛ భారత్ అనేది ఎప్పటికీ నిజంగాని ఓ పగటి కలగానే మిగిలిపోతుంది.

# దశాబ్దకాలంగా విద్యాభివృద్ధిలో వెనుకబడిన తెలంగాణ

తెలంగాణలో విద్యారంగం అస్తవ్యస్తంగా ఉంది, పేలవమైన బడ్జెట్ కేటాయింపులు, దిగజారిన ప్రమాణాలు, అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాలల్లో అభ్యాస ఫలితాలు దుర్భర స్థితిలో ఉన్నాయి. రాష్ట్ర విశ్వవిద్యాలయాల నియామకాలు ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య రాజకీయ కుమ్ములాటలో పుణ్యకాలం ముగిసిపోయింది. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో తెలంగాణ విద్యా రంగానికి మరోసారి పేదల చదువుకు దూరం చేసేదిగా ఉంది. రూ. 19,093 కోట్లుగా నిర్ణయించబడింది – ఇది మొత్తం రూ. 2,90.396 కోట్లలో 6.57% – భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచి ఈ రంగానికి బడ్జెట్ కేటాయింపులు ప్రతి ఏడాది స్థిరంగా పడిపోతోంది. తెలంగాణ 2014–15లో 10.89% నుండి విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులు స్థిరమైన పతనాన్ని చూసింది. అదే శాతానికి కేటాయిస్తే ఈ ఏడాది ఈ రంగానికి రూ.29,039 కోట్ల ఆదాయం వచ్చేది. తెలంగాణలో విద్యారంగం బడ్జెట్‌లో ఏటా పడిపోతున్నందున, బడ్జెట్‌లో 30% విద్యకు కేటాయించాలని సూచించిన కొఠారి కమిషన్ సిఫార్సులు పాటించడంలో రాష్ట్రం స్పష్టంగా విఫలమైంది. ఈ విషయంలో కేంద్రప్రభుత్వ రికార్డు ఏమంత మెరుగ్గా లేదు, ఎందుకంటే కేంద్ర బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం విద్య కోసం 10% కంటే తక్కువ కేటాయిస్తున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో కూడా, తెలంగాణ తన మొత్తం బడ్జెట్‌లో 6.24% విద్యపై ఖర్చు చేసింది – అఖిల భారత సగటు కేటాయింపు 15.2% (2021–22 బడ్జెట్ అంచనాల ప్రకారం) కంటే చాలా తక్కువ. కేజీ టు పీజీ ఉచిత విద్య అంటూ టీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దఎత్తున హామీలు గుప్పించినా, విద్యారంగానికి కేటాయింపులు మాత్రం తూతూమంత్రంగా మిగిలిపోయాయి. కేసీఆర్ తన కుమారుడి అసెంబ్లీ నియోజకవర్గమైన సిరిసిల్లలో రాష్ట్రంలోని మొట్టమొదటి కేజీ టు పీజీ ఏకైక మోడల్ షోపీస్‌ను ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఒక కార్పొరేట్ సంస్థ ద్వారా అభివృద్ధి చేయబడింది. విద్యా రంగానికి కేటాయింపులు పేలవంగా ఉండటం వాటి ప్రభావాన్ని చూపుతోంది. తెలంగాణలో అక్షరాస్యత రేటు 66.54% 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ సగటు 72.98% కంటే తక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత 67.77% అఖిల భారత సగటుతో పోలిస్తే 57.30%కి మరింత తగ్గింది. గత ఏడాది ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన మన ఊరు–మన బడి/మన బస్తీ–మన బడి పథకం (నా ఊరు–నా పాఠశాల/నా వార్డు–నా పాఠశాల) కేవలం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారు. 12 కాంపోనెంట్‌ల కింద పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఈ పథకం రూపొందించబడింది. "70% పాఠశాలల్లో కేవలం 10% నుంచి 15% పని పూర్తయింది, మిగిలిన 30% పాఠశాలల్లో పనులు ఇంకా ప్రారంభం కాలేదు. 9,123 పాఠశాలల్లో 600 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. నిధుల కొరత కారణంగా ప్రతికూల ప్రభావాలు విద్యారంగంలో ప్రమాణాలు దిగజారాయి.

పడిపోతున్న బడ్జెట్ కేటాయింపులు పాఠశాలల్లో ఆహార విషప్రయోగం తరచుగా సంభవించే సందర్భాలలో ప్రతిబింబిస్తాయి. "వినియోగ వస్తువుల ధరలు పెరిగినప్పటికీ మెస్ ఛార్జీలు 2016



నుండి సవరించబడలేదు. సిబ్బంది లేకపోవడంతో పారిశుధ్యం కూడా దెబ్బతింటోంది. రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ విద్యార్థుల ఆందోళనలు – ట్రిపుల్ ఐఐఐటి బాసరలో విద్యార్థుల ఆత్మహత్యలు, లంచావతారం ఎత్తిన విశ్వవిద్యాలయ అధికార గణం వార్తల్లో నిలుస్తున్నారు. సరైన సౌకర్యాలు కల్పించాలంటూ విద్యార్థులు పలుమార్లు నిరసనలు చేపట్టాల్సి వచ్చింది. 2008లో ప్రారంభమైన ఇన్‌స్టిట్యూట్ 2014–15 నుండి నిధులలో కోతలను ఎదుర్కొంటున్నారు. ఆరు మరియు ఎనిమిది తరగతుల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం, రాష్ట్రంలో పెరిగిన ఆర్థిక సంక్షోభం కారణంగా, అదనంగా 2,35,439 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను విడిచిపెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు (నవంబర్ 2021 నాటికి). అయితే, ప్రభుత్వ పాఠశాలల్లో 22,000 ఖాళీల కారణంగా, దాదాపు లక్ష మంది విద్యార్థులు విడిచిపెట్టారు. 2019లో రాష్ట్రంలోని జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత జిల్లాల సంఖ్య 10 నుంచి 33 అలాగే మండలాల సంఖ్య 594కి పెరిగింది. ప్రతి మండలానికి విద్యా అధికారి ఉండాలి, అవసరమైన సంఖ్యలో పోస్టులను సృష్టించడానికి, అవసరమైన నియామకాలు చేయడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. పాఠశాలల్లోని సిబ్బందికి పదోన్నతులు, బదిలీలు చేయడం కోసం ప్రభుత్వ పాఠశాలలను అనధికారికంగా హేతుబద్ధీకరణ పాల్పడుతోందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనివల్ల 1,250 పాఠశాలలు మూతపడ్డాయి

ప్రభుత్వం కొంత కాలం పాటు అర్హత కలిగిన ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలల నుండి ఉన్నత పాఠశాలలకు బదిలీ చేసింది. చివరిసారిగా 2015లో పదోన్నతులు కల్పించారు. ప్రథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలనే నిబంధనను పాటించకపోవడంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కనీసం విద్యా వాలంటీర్‌ని, రెగ్యులర్ టీచర్‌ను నియమించాలని కోరుతున్నారు. 1,250 పాఠశాలల్లో ఒకటవ తరగతిలో కొత్త విద్యార్థులు లేరనే కారణం చూపుతున్న ప్రభుత్వం ఇటీవల బదిలీ విధానంలో భాగంగా ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కేటాయింపును నిలిపివేసింది. ఇది పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా వదిలివేస్తుంది అలాగే విద్యను అందించే బాధ్యత నుండి క్రమంగా ఉపసంహరించుకోవడంలో భాగంగా పాఠశాలలను అప్రకటిత హేతుబద్ధీకరణకు దారి తీస్తుంది. ప్రకటించకపోవడం వల్ల అది రికార్డుల్లో కూడా ప్రతిబింబించదు. రాష్ట్రంలో అభ్యసన ఫలితాలు దుర్భరంగా ఉన్నట్లు గుర్తించడంలో ఆశ్చర్యం లేదు. గురుకుల పాఠశాలల సంఖ్యను 293 నుండి 1,002కు పెంచడంపై అశోక్ స్పందిస్తూ, "పిల్లలందరికీ సాధారణ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను అందించడానికి బదులుగా, ప్రభుత్వం గురుకుల పాఠశాలలకు అసమానంగా ఎక్కువ డబ్బు ఇస్తోంది. రాష్ట్రంలో 60 లక్షల మంది పాఠశాల విద్యార్థుల మొత్తం విద్యార్థుల బలంలో వారు కేవలం 9% మాత్రమే ఉన్నారు. ప్రభుత్వం సరైన సంప్రదింపులు జరపకుండా %+%.0 317 జారీ చేయడం వలన ఉపాధ్యాయులు తమ పోస్టింగ్‌లకు సంబంధించి నిరసనలకు దారితీసింది. ఇది ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) అనే గొడుగు సంస్థ క్రింద ఉపాధ్యాయ సంఘాలు కలిసి రావడానికి దారితీసింది. 2022 డిసెంబర్ 26న విద్యా సంవత్సరం మధ్యలో అందించిన అనాలోచిత బదిలీ మరియు పదోన్నతుల షెడ్యూల్ విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాల్సిన సమయంలో విద్యా షెడ్యూల్‌కు భంగం కలిగించింది. ఏప్రిల్‌లో మాత్రమే అమలులోకి రాబోతున్నప్పుడు, ప్రభుత్వం ఇప్పుడు సమస్యను ఎందుకు తీసుకు వచ్చిందో అర్థం కాలేదు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రతినెలా జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. కొన్ని నెలల్లో వారికి 15వ తేదీ నుంచి 20వ తేదీ లోపు చెల్లించిన సందర్భాలు ఉన్నాయి. ఎయిడెడ్, ఓరియంటల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అధ్వాన్నంగా ఉండి మూడు, నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. కోరినప్పుడు జీపీఎఫ్ (జనరల్ ప్రావిడెంట్ ఫండ్) మొత్తాన్ని చెల్లించకపోవడం, మెడికల్ బిల్లుల రీయింబర్స్‌మెంట్‌లో జాప్యం కారణంగా ఉపాధ్యాయులు పదేపదే రాష్ట్ర సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది. ఇది ఉపాధ్యాయుల హాజరు పై కూడా ప్రభావం చూపుతున్నాయి. పదోన్నతులు, పెండింగ్‌లో ఉన్న డీఏ (డియర్‌నెస్ అలవెన్స్) మరియు ఇతర పెండింగ్ బిల్లుల దృష్ట్యా బడ్జెట్‌లో 0.31 శాతం పెరుగుదల చాలా స్వల్పం. ఎంతో ప్రచారం జరిగిన మన ఊరు మన బడి కార్యక్రమానికి ప్రత్యేక కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. ఎన్నో ఏళ్లుగా యూనివర్శిటీల నిర్వహణను ఐఏఎస్ అధికారులకు అప్పగించిన తెలంగాణ ప్రభుత్వం వర్సిటీల్లో అధ్యాపకుల నియామకానికి బోర్డును ఏర్పాటు చేయడం ద్వారా మరో వివాదంలో చిక్కుకుంది. బోర్డులో కమీషనర్ కాలేజియేట్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఫైనాన్స్ సెక్రటరీ మరియు ఎడ్యుకేషన్ సెక్రటరీ ఉంటారు. ఈ అధికారులు కూడా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో భాగం, ఇది అసిస్టెంట్ మరియు అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకాలన్నింటినీ ఆమోదించాలి. సీనియర్ విద్యావేత్తలకు భిన్నంగా అకడమిక్ ఒరవడిని కలిగి ఉండకపోవచ్చని, విశ్వవిద్యాలయాలకు అధ్యాపకుల నియామకంలో ఐఏఎస్ అధికారులకు అధికారం ఇవ్వలేమని రాష్ట్రంలో గొంతులు వినిపిస్తున్నాయి. ఇది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలకు విరుద్ధం, ఇంటర్వ్యూ చేసే వ్యక్తి 10 నుండి 15 సంవత్సరాల బోధనా అనుభవంతో అర్హత సాధించాలి. అధ్యాపకుల నియామకంలో ప్రస్తుత విధానం గురించి ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే, %ఖ+జ% నిబంధనలను పాటించని కారణంగా కోర్టులు అటువంటి పద్ధతిని మరియు ఐఏఎస్ అధికారుల నియామకాలను కూడా రద్దు చేసే అవకాశం ఉంది. ఇంతకుముందు వైస్–ఛాన్సలర్లు అవినీతికి పాల్పడ్డారని, అందుకే ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించారనే "సాకు" సరైంది కాదు. "ఐఏఎస్ అధికారులు న్యాయంగా వ్యవహరిస్తారనే గ్యారంటీ ఏమిటి?". యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఒక బోర్డును ఏర్పాటు చేసేందుకు యోచిస్తున్న తరుణంలో, ఈ అంశం ప్రస్తుతం టీఆర్ఎస్ ప్రభుత్వానికి, గవర్నర్ తమిళసాయి సౌందరరాజన్‌కు మధ్య రాజకీయ కుమ్ములాటలో చిక్కుకుంది. బోర్డు ఏర్పాటుకు ఆమోదం తెలిపే బిల్లుకు గవర్నర్ ఆమోదం లభించలేదు, అన్ని నిబంధనలు పాటించేలా చూడాలని యూజీసీకి లేఖ రాస్తానని చెప్పారు. ఇదిలా ఉండగా 10 నుంచి 15 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో బోధన చేస్తున్న వారిపై కోర్టు కేసులు క్లియర్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. రిజర్వేషన్లు, ఇతర నిబంధనలను అనుసరించి రోస్టర్ విధానంలో ఆ నియామకాలు జరగలేదు . రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేయనందున, బోర్డు ఏర్పాటుపై వివాదం "సృష్టించబడింది" అని మేధావి వర్గం భావిస్తున్నది.

**డా. యం. సురేష్ బాబు.**

# వామనులమే..

మూడడుగుల వారమే...
నిజమే నేను అందవిహీననే
ముఖపద్మం మీదకి ఈదుకుంటూ
మెరిసే మీనాలు రాలేవు
శ్వాసించేందుకు పచ్చ సంపెంగ నాసిక
నీలాకాశం మీద విచ్చుకోలేదు
నలుగురిలో కళ్ళల్లోకి ధైర్యంగా చూసేంత
ఎత్తులో తలెత్తి మాట్లాడటానికి
అందమైన పెదవులు కూడా లేని
భూమికి మూడడుగుల వామనలమే
అవును మరుగుజ్జులమే!

ఆడదానిలా గాజులు తొడుక్కుని లేమని
అహంకార మగగొంతు మైకుల్లోంచి గర్జిస్తే
మహిళా సమూహాల ర్యాలీలు
జరుగుతాయి
ఏ కులాన్నో మతాన్నో
అధికారమదపు విశ్వరూపం
మాటలతోనే అవమానకరంగా
భూస్థాపితం చేయాలనుకుంటే
రెండో రోజే ప్రయాణ సాధనాల
అస్థిపంజరాలు
గోడౌన్ సమాధిలో నిద్రిస్తాయి
నగరాల పట్టణాల జీవితాలు
జీవించటం మర్చిపోతాయి!

కానీ మేమో
మూడడుగుల చిన్ని ప్రాణాలం కదా
ఆజానుబాహుల ప్రపంచంలో
మైనార్టీ సంఖ్యలం కదా
అందుకే కదా
మరుగుజ్జులతో పోటీ ఏమిటనీ
అంత ధైర్యంగా అనగలిగారు!

కానీ, ఒక్కటి మాత్రం నిజం
నేలకి దగ్గరగా ఉన్నందున



భూమ్యాకర్షణ శక్తిని పీల్చుకున్న
మా గుండెకి బలమెక్కువ
మా మెదడుకు తెలివీ ఎక్కువే
భూమికి లాగే సహనము ఎక్కువే!

అయితే తొలిచేస్తుంటే భూమి
మౌనంగా చూస్తూ ఉండటం లేదు
సమయం చూసి ఫెటేల్మనీ విచ్చుకునీ
మీరు కూడబెట్టిన ఆస్తుల్నీ
మిమ్మల్నీ కూడా మింగ గలదు.
అలాగే ఏదో ఒకనాడు
మరుగుజ్జులమైన మేమూ అంతే!

**– శీలా సుభద్రాదేవి**

# గులాబీ హ్యాట్రిక్ సాధ్యమేనా..?






హైదరాబాద్, అక్టోబరు 12, :అందరి కంటే ముందే 115 నియోజకవర్గాలకు అభ్యర్థుల్ని ప్రకటించారు. అభ్యర్థుల ప్రకటనతో విపక్షాలకు ఊహించని షాక్ ఇచ్చారు. ఎవరి అంచనాలకు అందని వ్యూహాలతో నెగ్గుకొచ్చే గులాబీ బాస్, ప్రత్యర్థులపై మరోసారి పైచేయి సాధించారు. ఎన్నికలకు ముందే తానేంటో మరోసారి చేసి చూపించారు. ఎన్నికలకు 40 రోజులు ముందే టికెట్లిచ్చామని, గెలుపు విషయంలో సీరియస్ గా ఉండాలని అభ్యర్థులకు చెప్పకనే చెప్పారు. యుద్ధంలో దిగకముందే సగం గెలుపు ఖాయం చేశారు కేసీఆర్. బీఆర్ఎస్ అసంతృప్తుల కోసం ఎదురుచూస్తున్న ఇతర పార్టీలకు, ఆ అవకాశం లేకుండా చేసే ప్రణాళికలు వేశారు. టికెట్లు దక్కనివారు పార్టీలోనే ఉండాలని, తర్వాత మంచి అవకాశాలు వస్తాయని భరోసా ఇచ్చారు. అందుకు అనుగుణంగానే తాడికొండ రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, చెన్నమనేని రమేష్ బాబులకు నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టారు. నిన్న మొన్నటి వరకు రాజయ్య, ముత్తిరెడ్డి, తామే అభ్యర్థులమంటూ చెప్పుకొచ్చారు. కేసీఆర్ హామీతో మెత్తబడ్డారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం చేస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ దిగనంతవరకే ప్రత్యర్థులకు ఛాన్స్. వన్స్ కేసీఆర్ స్టెప్ ఇన్, హిస్టరీ రిపీట్ అన్న డైలాగ్ కూడా రాజకీయాల్లోనూ రిపీట్ అవుతుందన్న గ్యారెంటీ బీఆర్ఎస్ నేతల్లో ఉంది. కేసీఆర్ చెప్పినట్టే ఈసారి మెజార్టీ సీట్లు సిట్టింగులకే కేటాయించారు. అభ్యర్థుల్ని కూడా ముందే ప్రకటించేశారు. తమ సంగతేంటో అని ప్రత్యర్థి పార్టీల్లో ఎంతో కొంత చర్చ జరగాలనే కేసీఆర్ వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ప్రత్యర్థులను ఇరుకు పెట్టేలా, పార్టీ పరంగా బీఆర్ఎస్ లో ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా చూసుకున్నారు. ప్రతిపక్షాల్ని గందరగోళపరచాలనే అజెండాతో కేసీఆర్ ముందుకెళ్తున్నారు. ఎప్పుడైనా ముందస్తు నిర్ణయాలతో మంచే జరుగుతుందని కేసీఆర్ భావిస్తున్నారు. తెలంగాణ రాజకీయాలు, భౌగోళిక పరిస్థితులపై కేసీఆర్ ఉన్నంత అవగాహన, క్లారిటీ, రాష్ట్రంలో మరే నేతకు లేదు. ఇంకా చెప్పాలంటే తెలంగాణ ఉద్యమం, జిల్లాల చరిత్ర, సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, ఆయకట్టు గురించి కేసీఆర్ ను కొట్టేవారే లేరు. బీఆర్ఎస్ కు కేసీఆరే కొండంత బలం. ఆయన ముందు తెలంగాణ ఏ పార్టీకి చెందిన నేతలైన దిగదుడుపే. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, వామపక్షాలు కలిసి పోటీ చేశాయి. దీన్నే కేసీఆర్ అవకాశంగా మార్చుకున్నారు. చంద్రబాబు వచ్చి తెలంగాణలో ప్రచారం చేయడంతో కేసీఆర్ సెంటిమెంట్ ఉపయోగించారు. తెలంగాణలో ఆంధ్రోళ్ల పాలన, బానిసత్వం అవసరమా అంటూ ప్రచారం చేశారు. ఇది బాగా వర్కౌట్ అయింది. కొన్నిచోట్ల సిట్టింగుల మార్పు ఖాయమని ప్రచారం జరిగిన నియోజకవర్గాల్లోనూ అనూహ్యంగా వారికే సీట్లు దక్కాయి. మెరుగైన అభ్యర్థులు లేకపోవడం, వ్యతిరేకత ఉన్నా గెలుపుకు ఢోకా లేదనే అంచనాలతో కొన్ని చోట్ల సిట్టింగ్ లకే ఛాన్స్ ఇచ్చారు. అందరికంటే ముందే అభ్యర్థుల్ని ప్రకటించడం ద్వారా ప్రత్యర్థులను ఆత్మరక్షణలోకి నెట్టారు. కాంగ్రెస్, బీజేపీలు ఇంకా అభ్యర్థులనే ఎంపిక చేయలేదు. కేసీఆర్ ముందుగానే అభ్యర్థులను ప్రకటించడంతో, నేతలంతా ఒప్పటికే నియోజకవర్గాన్ని రౌండ్ వేసేశారు. కేసీఆర్ వ్యూహాలు ఎవరికీ అంతుచిక్కవని మరోసారి ప్రూవ్ అయిందని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. ఎన్నికల ప్రచారంలో కూడా సరికొత్త వ్యూహాలు ఉంటాయని చెబుతున్నాయి. ప్రగతి ఆధారంగానే మళ్లీ గెలుస్తామని కేసీఆర్ ధీమాగా చెబుతున్నారు. గత తొమ్మిదేళ్లలో తెలంగాణలో ఏం జరిగిందో ప్రజలందరికీ తెలుసని, వారు తమనే ఆశీర్వదిస్తారని నమ్మకంగా ఉన్నారు. మిగతా పార్టీల్లో అభ్యర్థులు ఖరారయ్యే లోపే బీఆర్ఎస్ అభ్యర్థులు ఒక విడత ప్రచారం పూర్తి చేసేశారు. ఎక్కడైనా గ్యాప్స్ ఉంటే పూడ్చుకోవడానికి, మరింత బలం పెంచుకోవడానికి అభ్యర్థులకు అవకాశం కల్పించారు గులాబీ బాస్. ఒక్క అభ్యర్థుల ప్రకటనే కాదు, మ్యానిఫెస్టోలోనూ కీలక హామీలుంటాయనే ప్రచారం జరుగుతోంది. ఈ నెల 15న హుస్నాబాద్ వేదికగా కేసీఆర్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి బీఆర్ఎస్ కు టఫ్ ఫైట్ తప్పదని ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. సీట్లు కూడా తగ్గుతాయని సవాల్ చేస్తున్నాయి. కానీ ఉన్న సీట్లు పెరుగుతాయని బీఆర్ఎస్ నేతలు చెబుతూ వస్తున్నారు. అందుకే తమను ప్రతిపక్షం ఎక్కడా సవాల్ చేసే స్థితిలో లేదని ప్రూవ్ చేయడానికి గత ఎన్నికల మాదిరిగానే అడ్వాన్స్డ్ గా అడుగులు వేస్తున్నారు కేసీఆర్. ఆ విధంగా ప్రజల్లోకి బీఆర్ఎస్ బలంగా ఉందని, ప్రతిపక్షాలవి తాటాకు చప్పుళ్లేననే సంకేతాలు బలంగా పంపాలనుకుంటున్నారు. ఎన్నికల్లో కూడా ఏడుగురు సిట్టింగుల్ని మార్చిన కేసీఆర్, మంచి ఫలితాలే సాధించారు. కొత్తగా టికెట్లు దక్కిన వారంతా విజయం సాధించారు. ఈసారి కూడా సిట్టింగు స్థానంలో గెలిచేవారినే ఎంపిక చేశారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఎన్ని ప్రాతిపదికలు తీసుకున్నా, అంతిమంగా గెలవాలనే లక్ష్యంలో రాజీలేదంటున్నాయి. అసలు టికెట్లు దక్కనివారికి కొన్ని నెలలు ముందుగానే అగ్రనేతలు పరోక్ష సంకేతాలు ఇస్తూనే వచ్చారు. కొంతమందికి అయితే నేరుగా ముఖం మీదే చెప్పేశారు. అలా అసంతృప్తిని వీలైనంత వరకు ముందే తగ్గించేలా వ్యూహం రచించారు. ఎక్కడా అసమ్మతి అదుపు తప్పకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక లిస్ట్ ఫైనల్ చేశాం కాబట్టి.. చర్చలు అనవసరం అని కేసీఆర్ చెప్పేశారు. పంచాయితీలు మానేసి.. ప్రచారంపై దృష్టి పెట్టాలనే సంకేతం ఇచ్చేశారు. స్థానిక నేతలతో సమన్వయం చేసుకోవాలని అభ్యర్థులకు కూడా సూచించారు. ప్రత్యర్థులు అభ్యర్థుల్ని ఫైనల్ చేసే లోపే అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఏకతాటిపైకి రావాలనే ఉద్దేశంతోనే మూడ్నెళ్ల ముందే అభ్యర్థుల్ని ప్రకటించారు కేసీఆర్. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 88 సీట్లు వచ్చారు. అదే ప్లాన్ ను ఈ ఎన్నికల్లోనూ కేసీఆర్ అమలు చేస్తున్నారు. 15 నుంచి హుస్నాబాద్ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నారు. ఎలాంటి హామీలు ఇస్తారో వేచి చూడాలి.

## బీహార్ లో పట్టాలు తప్పిన ట్రైన్

పాట్నా, అక్టోబరు 12, :బిహార్‌లోని బక్సర్ జిల్లాలోని రఘునాథ్‌పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. బుధవారం రాత్రి వేళ నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో నలుగురు ప్రయాణికులు మృతి చెందారు. మరో 70 మందికిపైగా ప్రయాణికులు గాయపడ్డారు. ఢిల్లీలోని ఆనంద్ విహార్ టెర్మినల్ లో బయల్దేరిన నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ గౌహతిలోని కామాఖ్య జంక్షన్ వెళ్తోంది. రాత్రి 9:53 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఆరు కోచ్‌లు పట్టాలు తప్పాయి. రెండు ఏసీ 3 టైర్ కోచ్‌లు పట్టాలు తప్పాయి. దీంతో నాలుగు కోచ్‌లు ఎగిరి పడ్డాయి. "రైలు నంబర్ 12506 (ఆనంద్ విహార్ టెర్మినల్ నుంచి కామాఖ్య వరకు) రఘునాథ్‌పూర్ స్టేషన్ ప్రధాన లైన్ గుండా వెళుతోంది. ఆరు కోచ్‌లు పట్టాలు తప్పాయి" అని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. 23 కోచ్‌ల ఈ రైలు బుధవారం ఉదయం 7:40 గంటలకు ఢిల్లీలోని ఆనంద్ విహార్ టెర్మినల్ నుంచి కామాఖ్యకు బయలుదేరింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు మరణించారని బక్సర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) మనీష్ కుమార్ తెలిపారు. 70 మంది ప్రయాణికులు గాయపడ్డారని, వారిని స్థానిక ఆసుపత్రులకు తరలించారని రైల్వే పోలీసు ఫోర్స్ అధికారి తెలిపారు. తీవ్ర గాయాలపాలైన వారిని పాట్నాలోని ఎయిమ్స్‌కు తరలించారు. ఘటన జరిగిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు, అంబులెన్స్‌లు, వైద్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఢిల్లీ, దిబ్రూగఢ్ మధ్య రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సహా కనీసం 21 రైళ్లు దారి మళ్లించారు. కాశీ పాట్నా జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (15125), పాట్నా కాశీ జన్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (15126) రద్దు చేసినట్టు తూర్పు మధ్య రైల్వే జోన్ ప్రకటించింది. స్థానికులు మాట్లాడుతూ"రైలు సాధారణ వేగంతో నడుస్తోది కానీ అకస్మాత్తుగా పెద్ద శబ్దం వినిపించింది. రైలు నుంచి పొగలు వచ్చాయి, ఏం జరిగిందో చూడటానికి పరుగెత్తాము. రైలు పట్టాలు తప్పినట్టు గుర్తించాం. ఏఅ కోచ్‌లు ఎక్కువగా దెబ్బతిన్నాయి."తరలింపు, సహాయక చర్యలు పూర్తయ్యాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. మరణించిన వారికి సంతాపం తెలిపిన ఆయన, రైలు ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుపుతామన్నారు. పట్టాల పునరుద్ధరణపై అధికారులు దృష్టి పెట్టారు. మిగిలిన ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. విపత్తు నిర్వహణ విభాగం, బక్సర్, భోజ్‌పూర్ ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడినట్లు బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ తెలిపారు. వీలైనంత త్వరగా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు తగిన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈస్ట్ సెంట్రల్ రైల్వే జోన్ సిపిఆర్వో బీరేంద్ర కుమార్ మాట్లాడుతూ, రైలు బక్సర్ స్టేషన్ నుంచి బయలుదేరి అరగంటకే ప్రమాదం జరిగిందని చెప్పారు. ప్రమాదం నేపథ్యంలో రైల్వే శాఖ హెల్ప్‌లైన్ నంబర్లను విడుదల చేసింది.

## 3,4,8,9 తేదీలు... శుభముహూర్తాలు

హైదరాబాద్, అక్టోబరు 12, :తెలంగాణలో ఎన్నికల నగారా మోగింది. నామినేషన్లకు కూడా త్వరలో తెరలేవనుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 3న నామినేషన్లకు నోటిఫికేషన్ వస్తుంది. నవంబర్ పదో తేదీ దాకా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయొచ్చు. అయితే, తెలంగాణ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు.. ఒక్క అధికారపార్టీ బీఆర్ఎస్ మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది.. బీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు త్వరలోనే అభ్యర్థులకు బీ ఫాంలను అందించనున్నారు. మంగళవారం మంగళకరమైన రోజుగా భావించి ఆ రోజే పనులు చేపట్టేందుకు మొగ్గుచూపేవారూ ఉన్నారు. ఆ కోవలో కొందరు రాజకీయ నేతలు మంగళవారం రోజే నామినేషన్లు వేస్తారు. ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న ఇద్దరు మంత్రులు, వికారాబాద్ జిల్లాకు చెందిన ఓ నేత, ధనిక వర్గాలు ఎక్కువగా ఉండే ఓ నియోజకవర్గానికి చెందిన నేత, బీజేపీ కీలక నేత ఒకరు, బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఓ సీనియర్ నేత ఇలా కొందరు ఈరోజుకు ప్రాధాన్యం ఇస్తారు. రాజకీయ భవిష్యత్‌ను ఓటర్లు ఎలా నిర్ణయించే అవకాశం ఉందో చెప్పమని నేతలు పండితుల వద్ద క్యూ కడుతున్నారు. పుట్టిన తేదీ, వారి నక్షత్రం.. ఇలా గోచార బలాన్ని తెలుసుకుంటున్నారు. సిటీకి చెందిన ఓ మంత్రికి ఈసారి అనుకూల యోగం లేదన్న సమాచారంతో వారి కుటుంబం పరిహార పూజలు ప్రారంభించిందట. ఇక బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వచ్చిన ఓనేత తరపున ఆయన భార్య పూజల్లో నిమగ్నమయ్యారట. విపక్ష పార్టీలు కాంగ్రెస్, బీజేపీ త్వరలోనే టికెట్లను ప్రకటించనుంది. నామినేషన్ల దాఖలుకు దాదాపు నెల సమయం ఉంది. అయితే, ఇప్పటికే టికెట్ డిసైడ్ అయిన అభ్యర్థులు.. టికెట్ వస్తుందని ఊహాగానాల్లో ఉన్న పలు పార్టీల ఆశావహులు.. ఏ రోజున నామినేషన్ వేయాలి, ఏ రోజు ముహూర్తం బాగుంది..? అనే విషయాలు తెలుసుకోవడానికి పండితుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం..అయితే, నామినేషన్లు వేయడానికి ఆ నాలుగు రోజులను మించి ముహుర్తం లేదట. దీంతో నేతలు ఆ నాలుగు రోజుల్లోనే నామినేషన్ వేయడానికి రెడీ అవుతున్నారుట. నామినేషన్లకు నవంబర్ 3, 4, 8, 9 తేదీలు బాగున్నాయని పండితులు చెబుతున్నారు. ఆ 4 రోజుల్లో తిథి, నక్షత్ర బలం బాగుందని చెబుతున్నారు. దీంతో ఆయా రోజుల్లో ఏ టైమ్‌కి నామినేషన్ వేయాలి అనే విషయంపై పండితులను సంప్రదిస్తున్నారు నేతలు. ఆ 4 రోజుల్లోనే మ్యాగ్జిమమ్ నామినేషన్లు దాఖలవుతాయని భావిస్తున్నారు. నవంబర్ 3.. ఉత్తర నక్షత్రంతో కూడిన శుక్రవారం ముహూర్త బలం బాగా ఉందిట. దీనికితోడు అది శుక్రవారం కావడంతో ముస్లిం అభ్యర్థులు కూడా ఆసక్తి చూపే అవకాశం ఉంది. వారు పవిత్రంగా భావించే శుక్రవారం కావటవే దీనికి కారణం. నవంబర్ 4న.. పుబ్బ నక్షత్రం ఉంటుంది. అది ధన బలం కూడా మెండుగా ఉండే రోజుగా పండితులు పేర్కొంటున్నారు. ఆ రోజు నామినేషన్ వేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతారని చెబుతున్నారు. నవంబర్ 8న శ్రీరామచంద్రుల వారి నక్షత్రం అయిన పునర్వసు ఉంటుంది కాబట్టి ఆ రోజు కూడా ముహూర్తం బానే ఉందంటున్నారు. నవంబర్ 9న విష్ణు తిథిగా పేర్కొనే ఏకాదశి వస్తుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఆ రోజే నామినేషన్ దాఖలు చేయనున్నారని పార్టీ వర్గాలు ప్రకటించాయి. ఇది నామినేషన్ల ఘట్టం ముగియటానికి సరిగ్గా ముందు రోజు కావటం విశేషం. అయితే, ముహూర్త బలం అభ్యర్థుల విజయావకాశాలపై ఎక్కువగా ప్రభావం చూపిస్తుందని జ్యోతిష్య పండితులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నేతలందరూ వారి చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారు.

## హైదరాబాద్ లో కాఫీ, టీ ఏటీఎంలు




హైదరాబాద్, అక్టోబరు 12, :ఏటీఎంలు కేవలం డబ్బులు తీసుకోడానికే కాకుండా వేర్వేరు అవసరాల కోసం కూడా అందుబాటులోకి వస్తున్నాయి. నీళ్ల కోసం కూడా ఏటీఎం తరహా యంత్రాలు గతంలోనే వచ్చాయి. కొద్ది నెలల క్రితం హైదరాబాద్ గోల్డ్ ఏటీఎంని కూడా పెట్టారు. తాజాగా డబ్ల్యూటీసీ అనే యత్రం అందుబాటులోకి వచ్చింది. దీని పూర్తి పేరు 'వాటర్ – టీ – కాఫీ'. ఈ మూడు పానీయాలను ఇంకో వ్యక్తి సాయం లేకుండానే మిషన్ ద్వారా పొందవచ్చు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో తయారు చేసిన ఈ యంత్రాన్ని హైదరాబాద్ లో పెట్టారు. హైదరాబాద్‌కు చెందిన వినోద్ కుమార్ అనే వ్యక్తి ఈ యంత్రాన్ని రూపొందించారు. మరో వ్యక్తి అవసరం లేకుండా కేవలం క్యూఅర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా మనకి కావాల్సిన టీ, కాఫీ, వాటర్, బిస్కెట్స్ ఈ యంత్రం నుంచి వచ్చేస్తాయి. లక్ష రూపాయల ఖర్చుతో ఈ మెషిన్‌ని తయారు చేశామని దీని తయారీదారులు చెబుతున్నారు. సాధారణంగా ఎయిర్ పోర్టుల్లో, కార్పొరేట్ కంపెనీల్లో ఇలాంటి వెండింగ్ యంత్రాలు కనిపిస్తుంటాయి. వాటిలో బిస్కెట్లు, కూల్ డ్రింకులు, వాటర్ బాటిల్స్ ఉంటాయి. కానీ, టీ, కాఫీల్లాంటివి మాత్రం వాటిలో ఉండవు. ఈ యంత్రం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పని చేస్తుందని, దానికోసం స్పెషల్ సాఫ్ట్‌వేర్‌ను తయారుచేశామని తయారీదారులు చెబుతున్నారుసాధారణంగా, కూల్ డ్రింకులు, బిస్కట్ ప్యాకెట్లు వచ్చే మెషిన్ల ఖర్చు రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు ఉంటుందని.. తాము మాత్రం డబ్ల్యూటీసీ వెండింగ్ మిషన్ కేవలం రూ.లక్షకే తయారు చేశామని చెప్పారు. సెకన్ల వ్యవధిలోనే టీ, కాఫీ, వాటర్ ఇలా ఏదైనా వచ్చేస్తుందని చెప్పారు. కేవలం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా కావాల్సిన పానీయాలను పొందవచ్చు. డబ్ల్యూటీసీలో మొత్తం రెండు మెషిన్లను ఉంచారు. ఒక మెషిన్ నుంచి వాటర్ బాటిల్ వచ్చేలా చేశారు. మరో మెషిన్ లో పూర్తిగా టీ, కాఫీ వచ్చే విధంగా ఏర్పాటు చేశారు. మిషన్ పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పేమెంట్ లింక్ ఫోన్‌లో వస్తుంది. యూపీఐ పేమెంట్ చేయడం ద్వారా పేమెంట్ పూర్తి కాగానే సెలెక్ట్ చేసుకున్న పానీయం వస్తుంది. ఈ యంత్రంలో 100 నీళ్ల బాటిళ్లు, 200 టీ లేదా కాఫీ, 50 బిస్కెట్ ప్యాకెట్ల స్టాక్ ఉంచుతారు. నిల్వలు అయిపోయిన వెంటనే ఆ యంత్రం నిర్వహిస్తున్న వారికి ఒక అలర్ట్ వెళ్తుంది. వాళ్లు వెంటనే స్టాక్ ఫిల్ చేయాల్సి ఉంటుంది. ఈ తరహా మెషిన్లను త్వరలో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేయనున్నారు. మొదటిసారిగా ఎల్బీ నగర్ ఎల్పీటీ మార్కెట్ భవనంలో దీనిని ప్రారంభించారు. జెమ్ ఓపెన్ క్యూబ్ సంస్థ ఆధ్వర్యంలో టెక్నాలజీని ఉపయోగించి దీనిని ప్రారంభించారు. నగర వ్యాప్తంగా ఈ మెషిన్స్‌ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

## వర్శిటీ వెబ్ సైట్ లు అప్ డేట్ చేయండి



న్యూఢిల్లీ, అక్టోబరు 12, :దేశంలోని యూనివర్సిటీలు, కళాశాలలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) కీలక ఆదేశాలు జారీచేసింది. విద్యాసంస్థలన్నీ ఇకపై తమ వెబ్‌సైట్‌లలో ఫీజులు, రిఫండ్ పాలసీ, హాస్టల్ వసతులు, స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్స్, ర్యాంకింగ్స్, అక్రిడిటేషన్ వంటి వివరాలను తప్పనిసరిగా పొందుపరచాల్సిందేనని స్పష్టం చేసింది. ఉన్నత విద్యాసంస్థల్లో పారదర్శకతను పెంచేలా, విద్యార్థులు తప్పుదోవపట్టకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు తమ వెబ్‌సైట్‌లలో తప్పనిసరిగా ఉంచాల్సిన కంటెంట్‌కు సంబంధించి ఓ చెక్ లిస్ట్‌ను విడుదల చేసింది. కొన్ని విశ్వవిద్యాలయాలు తమ వెబ్‌సైట్లలో ప్రాథమిక సమాచారాన్ని కూడా పేర్కొనకపోవడం, కొన్ని వెబ్‌సైట్లు సరిగా పనిచేయకపోవడం, అప్‌డేట్ చేయకపోవడం వంటి అంశాలను గమనించిన తర్వాతే ఈ చర్యలు చేపట్టినట్టు యూజీసీ ఛైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీలు, కళాశాలలకు సంబంధించిన ప్రాథమిక సమాచారం అందుబాటులో లేకపోతే విద్యార్థులకు చాలా అసౌకర్యంగా ఉంటుందని జగదీశ్ కుమార్ అన్నారు. అందువల్లే విద్యాసంస్థలు వెబ్‌సైట్లలో పొందుపరచాల్సిన అంశాలతో చెక్‌లిస్ట్‌ను తయారు చేసినట్టు తెలిపారు. యూజీసీ రూపొందించినఈ చెక్‌లిస్ట్‌లో ఉన్నత విద్యాసంస్థలు/వర్సిటీల పేటెంట్ల వివరాలు, విదేశీ, పరిశ్రమలతో సహకారం, అంతర్గత నాణ్యత భరోసా కేంద్రం, అంతర్గత ఫిర్యాదుల కమిటీ, హెల్ప్‌లైన్‌తో కూడిన యాంటీ ర్యాగింగ్ సెల్, సమాన అవకాశాలకు సంబంధించిన విభాగం, పూర్వ విద్యార్థుల సంఘం, అంబుడ్స్‌మన్, అనుబంధ కళాశాలలు, ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు, విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార కమిటీ, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విభాగం, పౌర సంబంధాల విభాగం, అప్పిలేట్ అథారిటీ తదితర వివరాలతో యూజీసీ చెక్‌లిస్ట్ రూపొందించింది.

# ఆశీర్వదించండి మీ బిడ్డగా మీ మధ్య ఉంటూ సేవ చేస్తా



మధిర రూరల్ అక్టోబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలోబీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందాయి50 రోజుల్లో మధిర అసెంబ్లీపై ప్రజలందరి సహకారంతో గులాబీ జెండా ఎగరేస్తాంకెసిఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే కారును హై స్పీడ్ లో నడిపిస్తాయి. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనేమధిర ప్రజల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన భట్టి విక్రమార్క ఇక్కడ ప్రజలను గాలికి వదిలేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం హక్కున చేర్చుకొని అండగా నిలిచింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మధిర అభివృద్ధి చేయలేని భట్టి విక్రమార్క ఇప్పుడు బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధిని తానే చేస్తున్నట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంఓటమి భయం తట్టుకోలేక సంక్షేమ పథకాలపై భట్టి విక్రమార్క తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడు. నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశాం.. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసుకుంటాం మున్సిపాలిటీలో 100 పడకల ఆసుపత్రి, మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు సహా కోట్ల రూపాయల అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందిరైతు బందు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్, ఆసరా పెన్షన్లు, సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం వంటి విప్లవాత్మక పథకాలు అమలు చేసిన ఘనత కేసిఆర్ గారిదే బూత్ జోనల్ లెవల్ స్థాయి సభ్యుల సమావేశంలో జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర అసెంబ్లీ అభ్యర్థి లింగాల కమల్ రాజు , సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందాయని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి లింగాల కమల్ రాజు , రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం నాడు నియోజకవర్గ కేంద్రం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన బూత్ జోనల్ లెవెల్ సభ్యుల సమావేశంలో వారు పాల్గొన్న వారు మాట్లాడుతూ 50 రోజుల్లో అసెంబ్లీ పైన ప్రజలందరి సహకారంతో గులాబీ జెండా ఎగరవేస్తామని స్పష్టం చేశారు. కెసిఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఎన్నికల్లో కారు ను హై స్పీడ్ లో నడిపిస్తాయని తెలిపారు. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే అని అసెంబ్లీ నుండి కూడా అధికార పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన భట్టి విక్రమార్క ఇక్కడ ప్రజలను గాలికి వదిలేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం హక్కున చేర్చుకొని అండగా నిలిచిందన్నారు.. మధిర నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని రానున్న రోజుల్లో మధిర నియోజకవర్గాన్ని ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు డిప్యూటీ స్పీకర్ గా, ప్రభుత్వ చీఫ్ విప్ గా పని చేసిన భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచలేదు కానీ ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని తానే చేస్తున్నట్లు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. భట్టి విక్రమార్క తన ఓటమి భయం తట్టుకోలేక దళిత బంధు, గృహ లక్ష్మీ సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. నియోజకవర్గ కేంద్రం మధిర పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు, మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం లాంటి కోట్లాది రూపాయల అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందన్నారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్లు, సిఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం వంటి విప్లవాత్మక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కేసిఆర్ గారికి దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో ఐదు మండలాల నుండి మరియు మధిర మున్సిపాలిటీ నుండి పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, జోనల్ లెవల్ సభ్యులు పాల్గొన్నారు

## తెలంగాణ సాంస్కృతికి ప్రతీక బతుకమ్మ..

**వైరా లయన్స్ అధ్యక్షులు ఉపేంద్రరావు..**



వైరా, అక్టోబర్ 12 (ప్రజాపాలన న్యూస్):ప్రపంచంలోనే అతి పెద్ద పూల పండుగ బతుకమ్మ పండుగని ఈ పండుగకు సైన్స్ పరంగాను శాస్త్రీయత పరంగాను పూర్వకాలం నుండి ప్రత్యేక గుర్తింపు పొందినదని లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు అన్నారు. ఖానాపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు గంజిన బోయిన.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు బతుకమ్మ పోటీలు నిర్వహించి నంబూరు రామారావు, శ్రీదేవి దంపతుల సహకారంతో పాఠశాల వారి ఆధ్వర్యంలో విలువైన బహుమతులు అందజేసినారు .. ఈ కార్యక్రమంలో బాధ్యులు నంబూరు రామారావు, శ్రీదేవి, సృజన చింతోజు నాగేశ్వరరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు జి. రామకృష్ణ. పాల్గొనినారు

## నేడు ఎమ్మెల్యే సండ్ర పర్యటనను విజయవంతం చేయాలి..

**అంబేద్కర్ నగర్ సర్పంచ్ జొన్నలగడ్డ కిరణ్ బాబు..**



తల్లాడ, అక్టోబర్ 12 (ప్రజా పాలన న్యూస్): ఈనెల 13వ తేదీన తల్లాడ మండలంలోని అంబేద్కర్ నగర్ గ్రామంలో సత్తుపల్లి శాసనసభ్యులు గౌరవ సండ్ర వెంకటవీరయ్య గారు పర్యటిస్తారని, ఈ పర్యటనను గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని అంబేద్కర్ నగర్ గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ కిరణ్ బాబు పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే సండ్రా గారి ఆధ్వర్యంలో జరిగాయని తెలిపారు. ఇంటింటికి విస్తృతంగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## తెలంగాణలో బిఆర్ఎస్ కు తిరుగులేదు



చేవెళ్ల అక్టోబర్12, (ప్రజాపాలన):ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులు లేరని, బీఆర్ఎస్ పార్టీకి తీరుగు లేదని బీఆర్ఎస్ నాయకుడు కసిరె వెంకటేశ్, బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఎదిరె రాములు పేర్కొన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామంలో గురువారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్లలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు గల్లంతు అయ్యాయని, ప్రతిపక్ష పార్టీల్లోని నాయకుల్లో అసహనంతో అభ్యర్థుల ప్రకటన ఇంకా పూర్తి కాలేదన్నారు. చేవెళ్లలో కాలె యాదయ్య నాయకత్వంలో భారీ మెజార్టీతో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. దేశాన్ని 55 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని, ముచ్చటగా మూడో సారి సీఎం కేసీఆర్‌కే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి పక్షాలు ఎన్నికలు రాగానే కనిపించి సాధ్యం కాని హామీలు ఇవ్వడం సరికాదని హితవు పలికారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో గులాబీ ప్రభంజనం సృష్టించబోతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల రైతు బంధు సమితి అధ్యక్షుడు చింతకింది నాగార్జున రెడ్డి, ఆలూరు రైతు బంధు సమితి అధ్యక్షుడు పరిగి నర్సింలు పాల్గొన్నారు.

## రోడ్లు వేసిన వారికే ఓట్లు

అదిలాబాద్, అక్టోబరు 12, :స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా,తెలంగాణలో తమ గ్రామాలకు మాత్రం స్వాతంత్రం రావడం లేదని ఆ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దశాబ్దాల కాలం మారుతున్నా, తమ తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవి బిడ్డల తలరాతలు మార్చే తీరిక పాలకులకు లేదని ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ లోని, నిర్మల్ జిల్లా, కడం మండలం గంగాపూర్ , వస్పెల్లి, దొందారి గ్రామాలకు నేటికీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటవీ ప్రాంతాల్లో గంగాపూర్ గ్రామ పంచాయితీలో 12 గ్రామాలు అనుసంధానంగా ఉన్నాయి. పంచాయతీ పరిధిలో సుమారు 3000 మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. అత్యధికంగా ఆదివాసీ గోండులు ఉండే ఈ ప్రాంతంలో కనీస అభివృద్ధికి నోచుకోవడం లేదు. కడం నది అవతలి వైపు ఉండే ఈ ప్రాంతానికి వెళ్లాలంటే వాగు దాటాల్సిందే, మరోవైపు నుంచి వెళ్లాలన్న దట్టమైన అడవుల గుండా వెళ్లాల్సిందే, ఈ ప్రాంత వాసుల బాధలు గమనించి అప్పటి ఈ సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారి ప్రస్తుత అదిలాబాద్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ ఈ ప్రాంతానికి మట్టి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ వారిచే ఈ రోడ్డు సౌకర్యం ఏర్పడటంతో ఆ శాఖ తరపున అధికారికి అమెరికాలో అవార్డు సైతం అందజేశారు. అయితే అట్టి రోడ్డు ను తారు రోడ్డు గా మార్చాల్సిన ప్రభుత్వాలు మాత్రం ఇప్పటికి పట్టించుకోవడం లేదు. మట్టి రోడ్డును సుమారు 20 సంవత్సరాల క్రితమే నిర్మించినా నేటికీ బిటి రోడ్డుగా మారలేదు. ప్రతి వర్షాకాలం సీజన్లో గుట్టల నుంచి వరదలు రావడం రోడ్డు కొట్టుకపోవడం సర్వ సాధారణమైంది. ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే పసుపుల, గంగాపూర్ గ్రామాలకు నాలుగేళ్ల క్రితమే వంతెన నిర్మాణానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు, అయితే పనులు పిల్లర్ల మటుకే పరిమితం అయ్యాయి. వర్షాకాలం భారీ వరదలు రావడంతో వంతెనలో కొంత భాగం కొట్టుకొని పోయింది. పనులు నాసి రకంగా నిర్మించడంతోనే వంతెన కొట్టుకపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే పర్సెంటేజీల కోసం కాంట్రాక్టర్ ని వేధించడంతో పనులు నాసిరకంగా చేశారని, అక్కడికి గ్రామస్తులు జిల్లా కేంద్రంలో ధర్నాలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. తమ గ్రామాలకు రోడ్లు వేయడం లేదని, వేసే వరకు ఎన్నికలను బహిస్కరిస్తామని గంగాపూర్ గ్రామస్తులు తీర్మానించుకున్నారు. ఎన్నికలు రాగానే నాయకులు వస్తారని, అనంతరం మర్చిపోతారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా అటవీ ప్రాంతం లో నివాసం వుంటూ జీవనం కొనసాగిస్తున్నామని, తమను పట్టించుకోనే వారే లేరని తెలిపారు. అడవుల్లో విసిరేసినట్లుండే మా గ్రామాల్లో అటవీ జంతువుల భయంతో జీవితం నెట్టుకొస్తున్నామని చెప్పారు.

## బిఆర్ఎస్‌ను గద్దే దింపాలని సీపీఐని బలోపేతం చేయాలి: ముత్యాల యాదిరెడ్డి




ఇబ్రహీంపట్నం సెప్టెంబరు 12 ప్రజాపాలన ప్రతినిధి :భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల యాదిరెడ్డి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కావలి నరసింహ హాజరై మాట్లాడుతూ గ్రామ గ్రామాన సిపిఐ పార్టీని బలోపేతం చేయాలని అన్ని గ్రామాలలో శాఖ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజాసంఘాలను బలపతం చేయాలని గ్రామ శాఖ కార్యదర్శిలకు పిలుపునిచ్చారు అదేవిధంగా ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా పార్టీ కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషిచేసి పార్టీ మద్దతు ఇచ్చే ఎమ్మెల్యే క్యాండెట్ కు పూర్తి సహాయ సహకారాలు అందించి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ రాక్షస పాలన కొనసాగిందని అన్నారు. ఉచిత హామీల పేరుతో రాష్ట్ర ప్రజలని మోసం చేయడానికి మరొకసారి టిఆర్ఎస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో ముందుకు వస్తుందని విమర్శించారు ఎట్టి పరిస్థితిలో అవినీతి మరియు అహంకారపూరిత టిఆర్ఎస్ పార్టీని ఎన్నికల్లో గద్దె దించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు మతోన్మాదం చేస్తూ భారతీయ జనతా పార్టీ దేశంలో విచ్ఛిన్నకర శక్తులకి సపోర్ట్ చేస్తుందని అన్నారు. కేంద్రంలో బిజెపిని రాష్ట్రంలో టిఆర్ఎస్ ను కచ్చితంగా ఓడించి తీరాలని సిపిఐ కార్యకర్తలకు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు పోచమోని నీలమ్మ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి పూల యాదయ్య యాచారం మండల కార్యదర్శి మస్కు సంజీవ మంచాల మండల కార్యదర్శి రాజు నాయక్ సిపిఐ నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంగా ఉండేందుకు కృషి: మాల్ వెల్ఫేర్ ఎలక్ట్రీషన్ అసోసియేషన్ అధ్యక్షుడు యాట వెంకటయ్య



ఇబ్రహీంపట్నం సెప్టెంబరు 12 ప్రజాపాలన ప్రతినిధి :సమాజంలోని మెకానిక్, ఎలక్ట్రీషియన్ సంఘ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని సంఘం అధ్యక్షుడు యాట వెంకటయ్య తెలిపారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ వెల్ఫేర్, టెక్నీషియన్స్, ఎలక్ట్రీషియన్, అసోసియేషన్ యూనియన్ సభ్యులు పోలేపల్లి రాంనగర్ ఎస్ ఎస్ ఫంక్షన్ హాల్లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉంటూ, అర్హులైన వారు లేబర్ కార్డులు తీసుకోవాలని సూచించారు. లేబర్ కార్డు ఉండడం వల్ల బీమా సౌకర్యం, ఆర్థికపరమైన సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నజీర్, జీడిమెట్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ ఉప్పు పంచప్ప, ప్రధాన కార్యదర్శి ఎస్. కే. దావుద్, జాయింట్ కార్యదర్శి పరిపూర్ణాచారి, కోశాధికారి షకీల్, ఆర్గనైజర్ ప్రవీణ్, యాదయ్య, ఇంచార్జ్ రామాచారి, బాలాపురం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నిరంజన్, నగేష్, కోశాధికారి, మహమ్మద్ మజర్ అలీ బేగ్ (బాషా), తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ముదిరాజ్ మహాసభ జోలికొస్తే ఊరుకోం : తెలంగాణ ముదిరాజ్ మహాసభ




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి): నేటి ప్రజాస్వామ్య దేశంలో రాజ్య సభ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించడం సులువు కాదని, అటువంటిది తమ నాయకుని పట్ల చిలువలు పలువలుగా మాట్లాడినా, తెలంగాణ ముదిరాజ్ మహాసభ జోలికొస్తే ఊరుకునేది లేదని మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తుల అభివృద్ధిని కాంక్షించే ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండ ప్రకాష్ ను వ్యక్తిగతంగా దూషిస్తే క్షమించేది లేదన్నారు. ఇటీవలే పరేడ్ గ్రౌండ్లో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చేసిన బండ ప్రకాష్ పై కొంతమంది చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఒక పార్టీ కొరకు జరిగే సమావేశంలా కాకుండా ముదిరాజ్ కులస్తులకు అన్ని పార్టీలలో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని పార్టీ లలో ఉన్న ముదిరాజ్ నాయకులు వీలైతే తమ తమ పార్టీ లలో ముదిరాజ్ లకు బి ఫామ్ లు ఇప్పించే ప్రయత్నం చేయాలి కానీ మిగతా పార్టీ లలో ముదిరాజ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఎప్పటికి పోరాటం చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. జనాభా దామాషా ప్రకారం తమ కులానికి 12 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని సీఎం కెసిఆర్ కోరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్లపల్లి శ్రీనివాస్ తో పాటు అల్లుడు జగన్,మోర రవికాంత్,మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు ఎదురుచూస్తున్న సమస్య పరిష్కారం




బోనకల్, అక్టోబర్ 12 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో గల కంచర్ల చెంచయ్య ఇంటి ముందు నుండి 11 కేవీ విద్యుత్తు లైను ఎస్ సి కాలనీ మీదుగా వెళుతుంది. అయితే అక్కడ వేసిన స్తంభం ఎత్తు తక్కువ వేయటం వలన ఈ 11 కె.వి వైర్లు భూమికి తక్కువ ఎత్తులో ఉండుటవలన ఆ ప్రాంతంలో నివసించేవారు భయంభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో అనేకమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినను ఎటువంటి పరిష్కారం చేయలేదు. అయితే ఇటీవల తూటికుంట్ల సర్పంచ్ నోముల వెంకట నరసమ్మ విద్యుత్ ఏఈ ఉమామహేశ్వరరావు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా వెంటనే స్పందించి సమస్య ఉన్న కంచర్ల చెంచయ్య ఇంటి వద్ద ఎత్తు స్తంభం వేయించి ఈ సమస్యను పరిష్కరించారు. ఎట్టకేలకు ఎదురుచూస్తున్న ఈ విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించినందుకు ఏఈ ఉమామహేశ్వరరావుకు, విద్యుత్ శాఖ సిబ్బందికి తూటికుంట్ల సర్పంచ్ నోముల వెంకట నరసమ్మ , గ్రామపంచాయతీ పాలకవర్గం కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆదర్శభావాలతో కూడిన సేవలు సదా గుర్తించబడతాయి !

**తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ వైస్ ఛైర్మన్ దీటి మల్లయ్య**



హైదరాబాద్: సంఘంలో బాధ్యత కలిగి ఉన్నప్పుడు సాధారణ రీతిలో సేవ చేయడమే కాదు వారి తదనంతరం కూడా వారు చేసిన సేవలను ఇతరులు గుర్తుంచుకొని ఆదర్శంగా తీసుకోవడంలోనే గొప్పదనం ఉండగలదని తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య వైస్ ఛైర్మన్ దీటి మల్లయ్య ఉద్ఘాటించారు. బోడుప్పల్ గంగపుత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కీ.శే.పాక వెంకట లక్ష్మణ్ 16వ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు పాక మధుసూదన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎవరైతే సంఘానికి అంకితబావంతో పనిచేసే తత్వం అలవర్చుకుంటారో వారి కుటుంబ సభ్యులు కూడా అదే దృక్పథంతో క్రమశిక్షణ కలిగి ఇతరులకు మార్గదర్శకం కాగలరన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్ స్థానిక కార్పొరేటర్ జడిగే మహేందర్ యాదవ్, మాజీ ఎం.పి.టి. సి.లు తోటకూర చందర్ యాదవ్, దేవరకొండ వీరాచారి, మాజీ వార్డు సభ్యులు తోటకూర రవీందర్ యాదవ్, భా.జ.పా. ఓ బి సి మోర్చా రాష్ట్ర ఫిషరీస్ సెల్ కన్వీనర్ కాపర్తి మోహన్ కృష్ణ, గంగపుత్ర రాష్ట్ర నాయకులు ఇటికెల సతీష్, అనుమాస అశోక్, కైరం కొండ యాదగిరి,బోడుప్పల్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు పాక మధుసూదన్, ప్రధాన కార్యదర్శి బంగారి కుమార స్వామి, కోశాధికారి లింగమూర్తి, కార్యవర్గ సభ్యులు జగన్నాధం, పూస యాదగిరి, కూర బాలరాజు,బిక్షపతి,అశోక్ మరియు కుటుంబ సభ్యులు శుభలక్ష్మీ, ప్రేమ్ కిషోర్ ,పి.ఎల్. నర్సింగ్ రావు, ప్రణీత్ భార్గవ్, దుర్గా ప్రసాద్, సాకేత్, లావణ్య, లత, ప్రతీక్ష తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తెచ్చుకుంది దొరలు దోపిడీ దారులు కోసం కాదు

## కాంగ్రెస్ పార్టీ కొన్ని రోజుల్లోనే తెలంగాణ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వం



మధిర రూరల్ అక్టోబర్ 11 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో స్థానిక రెడ్డి గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన క్లస్టర్ 3 కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ నాయకుల సమావేశానికి హాజరై సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మల్లు సీఎల్పీ నేత భట్టి విక్రమార్ విలేకరుల సమావేశంతెలంగాణ తెచ్చుకుంది దొరలు దోపిడి దారుల కోసం కాదునాలుగున్నర కోట్ల ప్రజల బాగు పడడానికి కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది. టిఆర్ఎస్ 10 సంవత్సరాల పరిపాలనలో రాష్ట్రానికి కొత్తగా ఒక పరిశ్రమ ఒక ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయలేదు.సర్వీస్ సెక్షన్లో పనికొచ్చే వ్యవస్థలను తీసుకురావడంలో విఫలమైంది.పది సంవత్సరాల కాలంలో అభివృద్ధి పేరిట ఐదు లక్షల కోట్ల రూపాయల అప్పు, పది సంవత్సరాల బడ్జెట్ టిఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసింది.మాటలు మాత్రం కోటలు దాటించే టిఆర్ఎస్ నాయకులు ఎన్నికలవేళ రాష్ట్రంలో పర్యటన చేస్తూ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు పొందే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలారా వీరి పట్ల జాగ్రత్త ఉండాలిఓటు మన భవిష్యత్తుకు ఉపయోగపడేది. అభివృద్ధికి పునాదిగా ఉపయోగపడే మన ఓట్లను మోసగాళ్లకు, దోపిడిదారులకు వేయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్కు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నటిఆర్ఎస్ పార్టీ ఎక్స్పైరీ డ్రగ్గా మారి బిఆర్ఎన్ గా రూపాంతరం చెందింది.రాష్ట్రంలో ఉన్న టిఆర్ఎన్ ప్రభుత్వం కేంద్రంలో ఉన్న బిజెపితో చేతులు కలిపి తెలంగాణలో బిజెపికి బీ టీంగా పనిచేస్తున్నది.బిజెపికి బీ టీముగా మారిన బీఆర్ఎస్ కు ఎంఐఎం పార్టీ వంత పాడుతూ భజన చేస్తున్నది.దేశ సంపదను ఆదాని భవన జాతి కంపెనీలకు దోచిపెట్టి ప్రధాని మోడీకి ఉపయోగపడే విధంగా మారిన బిఆర్ఎస్బీఆర్ఎస్ కు ఓటు వేస్తే బిజెపికి వేసినట్టే.తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్ ఎంపీలకు ఓట్లు వేస్తే ఢిల్లీలో బిజెపి ఆధ్వర్యంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాలకు మద్దతుగా బిఆర్ఎన్ ఎంపీలు ఓట్లు వేశారు.ప్రభుత్వ రంగ సంస్థల నమ్ముతున్న బిజెపికి మద్దతు ఇస్తున్న బిఆర్ఎస్ కు ఓట్లు వేద్దామా? తెలంగాణకు సిరుల బంగారం కురిపిస్తున్న సింగరేణి కాలరీస్ ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేస్తూ సంపదలను దోచుకుంటున్నాయి.హైదరాబాద్ చుట్టూ ఉన్న విలువైన భూములను టిఆర్ఎస్ ప్రభుత్వం అప్పానంగా అమ్మేస్తున్నదిటిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి తీసుకువచ్చి ప్రభుత్వ భూములను తన బినామీల పేరిట నమోదు చేస్తున్నారురాష్ట్రానికి ఆదాయం తీసుకొన్తున్న హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లాంటి రాష్ట్ర ఆస్తులను బిఆర్ఎస్ ప్రభుత్వం పనికిమాలిన సంస్థలకు లీజికి ఇచ్చి రాబోయే 30 సంవత్సరాల ఆదాయాన్ని దోపిడీ చేస్తున్నది.ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దళిత గిరిజనులకు చెందకుండా పక్కదోవ పట్టిస్తున్న బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కెసిఆర్ బీసీ జనాభా 50% ఉన్న బీసీలకు బడ్జెట్లో నగం బడ్జెట్ కేటాయించాల్సిన సీఎం కేసీఆర్ బీసీ బంధు పేరిట తూతూ మంత్రంగా నిధులు ఇచ్చి మోసం చేశారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలు ఇండ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వడం ఇష్టంలేని టిఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర చేస్తూ మూడు లక్షలు రూపాయలు గృహలక్ష్మి పేరిట ఇచ్చారు అవి ఎన్నికల ముందు ఇవ్వడంతో ఇండ్ల నిర్మాణానికి ఏమాత్రం పనికి రాకుండా పోయాయి.ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేసిన సందర్భంగా ప్రజలందరూ ఈ రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్న దోపిడిదారులను తరిమికొడతామని చెప్పారు.జరగబోయే ఎన్నికల్లో ప్రజలు దోపిడి దారులను తరిమికొట్టే విధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిపువ్వాళ్ళ దుర్గాప్రసాద్, సూరంసెట్టి కిషోర్, మిరియాల వెంకటరమణ గుప్తాలి బూత్ కమిటీ ఇన్చార్జిలు లిబండారు నరసింహారావు పారువల్లి విజయకుమార్ బొల్లెద్దు రాజేంద్ర ఆదిమూలం శ్రీనివానరావులి కాంగ్రెస్ నాయకులు ఎర్రగుంట లక్ష్మి, టీవీ చౌదరి, దేవి శెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు,అద్దంకి రవికుమార్, దుంప వెంకరేశ్వర్రెడ్డి, నిడమనూరి వంశీ కృష్ణ, షేక్ జహంగీర్ మండల బనవత్ వెంకటరమణ నాయక్ షేక్ బాజీ డివిజన్ కమిటీ అధ్యక్షులు షేక్ షన్ను,మల్ల ప్రదీప్,మోదుగుబాబు,,కోమకుల రమ, అద్దంకి మంజీర, గౌసుద్దీన్,కోట దేవిడ్, తలుపుల వెంకటేశ్వర్లు, మాగం ప్రసాద్ ,మరియు బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## రిపోర్టర్ సందీప్ పాడె మోసిన (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు రహమాన్



అసిఫాబాద్ జిల్లా (కాగజ్ నగర్) అక్టోబర్12 (ప్రజాపాలన,ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ గురువారం కాగజ్ నగర్ రిపోర్టర్ చెన్నూరి సందీప్ అంతిమ యాత్రలో పాల్గొని సంతాపం తెలిపారు. అయన నివాసంలో భౌతికకాయం వద్ద నివాళులర్పించిన అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని అబ్దుల్ రహమాన్ పాడె మోశారు. ఈ సందర్భంగా సందీప్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సందీప్ చిన్న వయసులో చనిపోవడం చాలా బాధాకరమన్నారు. సందీప్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

కాగజ్ నగర్ పట్టణానికి చెందిన విలేఖరి ఈర్ల సతీష్ కుమార్ సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ జర్నలిస్టులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట టియుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు షఫీ ఉల్లా బేగ్ , నౌషాద్, యూసుఫ్, రతన్ కుమార్,సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆదర్శ విద్యార్థుల ఎంపిక: ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్



ఆసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 11 (ప్రజాపాలన,ప్రతినిధి) : జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థినిలు చౌదరి వైష్ణవి, ఆడే గాయత్రి, ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 19 కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 17న సంగారెడ్డిలో నిర్వహించనున్నా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అదే విధంగా పూణేలో గత నెలలో నిర్వహించిన జాతీయస్థాయి అండర్ 17 సాఫ్ట్ బేస్ బాల్ పోటీల్లో జాతీయస్థాయి రజక పథకం సాధించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని వొజ్జల పూజితను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడల్లో రాణించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, పిడి తిరుపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

# విజయమ్మ, షర్మిల పోటీకి సిద్ధం

హైదరాబాద్, అక్టోబరు 12, :కాంగ్రెస్ పొత్తు సక్సెస్ కాకపోవడంతో వైఎస్ఆర్టీపీ ఒంటరిగానే బరిలోకి దిగుతోంది. వైఎస్ షర్మిల రెండు స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో వైఎస్ విజయమ్మ కూడా ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ తో పొత్తు కుదరకపోవడంతో తెలంగాణ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని వైఎస్ఆర్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల డిసైడ్ అయ్యారు. అయితే ఎన్నికల బరిలో తన తల్లి విజయమ్మను నిలపాలని షర్మిల భావిస్తున్నారని సమాచారం. దీంతో పాటు 100 సీట్లలో వైఎస్ఆర్టీపీ పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. పాలేరు, మిర్యాలగూడ 2 స్థానాలలో షర్మిల పోటీ చేయనున్నారని, సికింద్రాబాద్ నుంచి వైఎస్ విజయమ్మ బరిలో నిలిచే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి.ముఖ్యనేతలతో సమావేశం అవుతున్న షర్మిల... నియోజక వర్గాల వారీగా పలువురు అభ్యర్థుల పేర్లు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. సూర్యాపేట నుంచి పిట్ట రాంరెడ్డి, సత్తుపల్లి నుంచి కవిత, బోధన్ నుంచి సత్యవతి, కల్వకుర్తి నుంచి అర్జున్ రెడ్డి, వనపర్తి నుంచి వెంకటేశ్వర రెడ్డి, నర్సంపేట నుంచి శాంతికుమార్, అదిలాబాద్ నుంచి బెజ్జంకి అనిల్, చేవెళ్ల నుంచి దయానంద్, గజ్వేల్ నుంచి రామలింగారెడ్డి, సిద్దిపేటలో నర్సింహారెడ్డి, సిరిసిల్లలో చొక్కాల రాము, కామారెడ్డి నుంచి నీలం రమేశ్, అంబర్ పేట నుంచి గట్టు రామచంద్రరావును ఎన్నికల బరిలో నిలిపేందుకు వైఎస్ఆర్టీపీ సన్నాహాలు చేస్తుంది.

## అభయ సాయి దేవాలయంలో అన్నదానం



మధిర రూరల్ అక్టోబర్ 12 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో రెండో వార్డ్ ఎన్జీవోస్ కాలనీలో అభయ సాయి మందిరంలో ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమంలో భాగంగా దాతలు సాగి సందీప్ రవళి, వినుకొండ రూప , కే రామకృష్ణ భవాని, జి వెంకటేశ్వరరావు వసంత. సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని , భక్తులు తమ పెళ్లిరోజు, పుట్టినరోజు కానీ ఓ ప్రత్యేక రోజు అన్నదానం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## జీవి అకాడమీ నందు ఘనంగా బతుకమ్మ సంబరాలు



మధిర అక్టోబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో స్థానిక జీవి అకాడమీ మిలీనియం పాఠశాలలో బతుకమ్మ సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారు చేసుకొని పాఠశాలకు తీసుకువచ్చి వాటిని ఒకచోట పేర్చి బతుకమ్మ పాటలతో గౌరమ్మను పూజించారు. విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తులను అలంకరించుకొని భక్తి భావాలతో గౌరమ్మను పూజించి మళ్లీ రా బతుకమ్మ అని చెరువుల వదిలి గౌరమ్మ ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వెంపటి గోపీచంద్, పాఠశాల ప్రిన్సిపాల్ టీ శ్రీనివాసరావు, బ్రాంచ్ హెడ్ ఎస్ రాజేశ్వరి, ఎండి నహర్ సుల్తానా, శ్రీదేవి, దివ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రామంతాపూర్ డివిజన్లో బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం



మేడిపల్లి, అక్టోబర్ 12 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మా రెడ్డి గెలుపుకై రామంతాపూర్ డివిజన్లో బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం చేస్తున్నారు. బండారి లక్ష్మా రెడ్డి గెలుపుకోసం మూడోవ రోజు పాదయాత్ర మాజీ కార్పొరేటర్ గంథం జోత్స్నా నాగేశ్వరావు అధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు డివిజన్ పరిధిలోని భరత్ నగర్,హనుమాన్ వ్యాయమశాల నుంచి బాలజీ నగర్,శాంతి నగర్లో విస్తృత ప్రచారం చేస్తూ కారు గుర్తుకు ఓటు వేసి బండారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాలకూరి సరితా శ్రీకాంత్ గౌడ్,ముస్తాక్,పాల్వాయి మధుసూదన్ రెడ్డి,సంపత్ రావు,సాగ రవి,రాజు యాదవ్,తిప్పటి సంపత్,సురం శంకర్,శ్రీనివాస్ రెడ్డి,కొప్పు నర్సింగ్ రావు,బుస శంకర్,చాంద్ పాషా,జహంగీర్,బోసాని పవన్,శ్రీకాంత్ గౌడ్,ముత్యాల మధు,సమీర్,తిరుమల రాజు,మద్దురి శ్రీనివాస్,ధనుంజయ్ గౌడ్,మారుతీ,వనపల్లి శ్రీనివాస్ రెడ్డి,మందపాటి శ్రీనివాస్ రెడ్డి,స్వప్నా ,చాపలక్ష్మి ,లక్ష్మి ,తుముల లక్ష్మి ,విజయలక్ష్మి,సబితా,మున్న,రాజు,సతీష్,జిబి సాయి,లక్ష్మణ్,లడ్డుభాయ్,బాబు రావు,బాలకుమార్,సైదులు,మల్లేష్ యాదవ్,బబ్లు,టిల్లు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సోనాలిక కంపెనీ దేశంలోనే నెంబర్ వన్..

### వైరాలో ట్రాక్టర్ షోరూమ్ ప్రారంభించిన తాళ్లూరి మోహన్..



వైరా, అక్టోబర్ 12 (ప్రజా పాలన న్యూస్): వైరా పట్టణంలోని శాంతినగర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన హరి సాయి మణికంఠ సోనాలిక ట్రాక్టర్ షోరూమ్ సర్వీసింగ్ పాయింట్ ను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తాళ్లూరి మోహన్ చిట్టూరి శివకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు గ్రామీణ ప్రాంత రైతులకు ఉపయోగపడే విధంగా ఈ ప్రాంతంలో ట్రాక్టర్ షోరూమ్ సర్వీసింగ్ పాయింట్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు, సోనాలిక కంపెనీ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని అన్నారు. రైతులకు ఐదు సంవత్సరాల గ్యారంటీతో నూతన టెక్నాలజీతో తక్కువ ధరకు సోనాలిక ట్రాక్టర్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంత రైతులు వినియోగించుకోవాలని కోరారు తమ సంస్థ ఖాతాదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఏరియా మేనేజర్ మణికంఠ, సర్వీసింగ్ మేనేజర్ వినోద్, హరి, సాయి మణికంఠ, సర్వీస్ టీం ఫైనాన్స్ సంస్థ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఓం ఆదిత్య స్కూల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు..



ఏన్కూరు, అక్టోబర్ 12 (ప్రజాపాలన న్యూస్): ఏన్కూరు మండలంలోని తిమ్మారావుపేట గ్రామంలో ఉన్న ఓం ఆదిత్య గాయత్రి స్కూల్లో బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆ పాఠశాల కరస్పాండెంట్ దాసరి రమేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మలను అందంగా తయారుచేసి ఆటలు ఆడి, పాటలు పాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రినిటి స్కూల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు



లక్షెట్టిపేట , అక్టోబర్ 12, ప్రజాపాలన: పట్టణంలోని ట్రినితో స్కూల్లో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు జరిపారు ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ జోసెఫ్ మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ మరియు దసరా పండుగని పురస్కరించుకొని విద్యార్థులకు శుక్రవారం నుండి దసరా సెలవులు ఉండటం వల్ల ఈరోజు పాఠశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించామని తెలియజేశారు. ప్రపంచంలో దేవుళ్ళని ప్రతి ఒక్కరూ పూలతో పూజిస్తారు కానీ పూలనే దేవుళ్ళుగా పూజించే సంస్కృతి కేవలం మన తెలంగాణలోనే ఉండటం మన అదృష్టమని తెలిపారు. పాఠశాలలో ప్రతి సంవత్సరం స్కూల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహిస్తారు. అలాగే బతుకమ్మ విశిష్టతను తెలియజేస్తూ విద్యార్థులకు చక్కని విద్యతో పాటు, సాంప్రదాయ విలువల్ని నేర్పిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో , విద్యార్థినిలు మరియు ఉపాధ్యాయునిలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పాటలు పడుతూ బతుకమ్మ ఆడారు.

## భరత్ విద్యాసంస్థల్లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



మధిర అక్టోబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో భరత్ విద్యా సంస్థల డైరెక్టర్ శీలం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం రేపటి నుండి పాఠశాల విద్యార్థులకు దసరా సెలవులు కావడంతో గురువారం పాఠశాలలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సంప్రదాయ దుస్తులలో తీరొక్క పూలతో రంగురంగుల బతుకమ్మలను పేర్చి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ ముత్యాలు చేస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భరత్ విద్యాసంస్థల కరస్పాండెంట్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ శీలం విద్యాలత,11వ వార్డు కౌన్సెలర్ గద్దల మాధురి హాజరై విద్యార్థులకు బతుకమ్మ పండుగ ఆవశ్యకతను తెలిపి బతుకమ్మ,దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జింకల కోటేశ్వరరావు,ఉమా,డీన్ రవీందర్ రెడ్డి,స్రవంతి,నాగరాజు,అజీమ్,పాషా, గణేష్,రమేష్,శశికళ,రాజేశ్వరి,లావణ్య,పద్మ,సీత,త్రివేణి,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## "స్కంద" ఓటిటి డేట్ లాక్ అయ్యిందా




టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్ లో తెరకెక్కించిన లేటెస్ట్ మాస్ యాక్షన్ చిత్రమే "స్కంద". మరి మంచి అంచనాలు నడుమ రిలీజ్ అయ్యిన ఈ చిత్రం రామ్ కెరీర్ లోనే భారీ ఓపెనింగ్స్ ని అందుకుంది. దీనితో ఈ చిత్రం అయితే రామ్ కెరీర్ లో మరో మంచి గ్రాసర్ గా నిలవగా ఇప్పుడు అయితే ఆల్ మోస్ట్ థియేట్రికల్ రన్ ని కంప్లీట్ చేసుకునే స్టేజ్ కి వచ్చేసింది. ఇక ఈ సమయంలో ఈ సినిమా ఓటిటి రిలీజ్ డేట్ పై ఇంట్రెస్టింగ్ బజ్ అయితే తెలుస్తుంది. దీనితో ఈ చిత్రం ఈ అక్టోబర్ 27న అయితే స్ట్రీమింగ్ కి రానున్నట్టుగా తెలుస్తుంది. మరి ఈ చిత్రం స్ట్రీమింగ్ హక్కులు ప్రముఖ సంస్థ డిస్నీం హాట్ స్టార్ వారు సొంతం చేసుకోగా ఇందులో ఈ చిత్రం స్ట్రీమింగ్ కి రానున్నట్టుగా తెలుస్తుంది. మరి దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించగా శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ వారు నిర్మాణం వహించారు.

## గుంటూరు కారం.. రాబోయే రెండున్నర నెలల పాటు మోతే!



సూపర్ స్టార్ మహేశ్ బాబు – మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబోలో రూపొందుతున్న భారీ మాస్ ఎంటర్‌టైనర్ సినిమా గుంటూరు కారం. ఈ సినిమా రిలీజ్ కోసం, అలాగే ప్రమోషన్స్ ఎప్పుడెప్పుడు ప్రారంభం అవుతాయా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా అదిరిపోయే ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ బయటకు వచ్చింది. తాజాగా అందిన సమాచారం ప్రకారం.. ప్రమోషన్స్‌ను మొదలుపెట్టాలని మూవీటీమ్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. దసరా నుంచి ప్రమోషన్స్‌ను ప్రారంభించి.. రాబోయే రెండున్నార నెలల పాటు గ్యాప్ లేకుండా బ్యాక్ టు బ్యాక్ అప్డేట్స్ అండ్ సర్‌ప్రైజెస్‌తో సంక్రాంతి వరకు అభిమానుల్లో జోష్ నింపాలని రెడీ అవుతోందట. సంక్రాంతి రాబోయే సినిమాల లైనప్ పెద్దగా ఉండటం వల్ల.. వాటిలో గుంటూరు కారం సినిమాకే ఎక్కువ బజ్ క్రియేట్ అయ్యేలా స్ట్రాటజీని ఫాలో అవ్వాలని ప్లాన్ చేస్తోందని తెలుస్తోంది. ఫస్ట్ సింగిల్‌ను దసరా కన్నా ముందే రిలీజ్ చేయాలని మేకర్స్ కౌంట్‌డౌన్ పెట్టుకున్నారట. ఆడియో సింగిల్‌ను రిలీజ్ చేసి.. ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ గ్యాప్ లేకుండా అప్డేట్స్ ఇస్తానే ఉంటామన్న సంకేతాలను ఇవ్వడంతో పాటు సినిమా ఎలా ఉండబోతుందో రుచి చూపించనున్నారట. మూవీ కచ్చితంగా బ్లాక్ బాస్టర్ హిట్ అవుతుందని నమ్మకంతో ఉన్నారంట. ఇకపోతే ఇప్పటివరకు పోస్ట్‌పోన్ చేసుకుంటూ ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఈ మధ్యే షూటింగ్‌ను జరుపుకుంటున్న ఈ గుంటూరు కారం చిత్రాన్ని.. ఎలాగైనా వచ్చే ఏడాది 2024 సంక్రాంతికి రిలీజ్ చేసే దిశగా ముందుకు వెళ్తోంది మూవీటీమ్. అందుకు తగ్గట్టు షెడ్యూల్స్‌ను ప్లాన్ చేసి షూటింగ్ చేసుకుంటూ ముందుకు సాగుతోంది. చిత్రంలో శ్రీలీల – మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. అతడు, ఖలేజా చిత్రాల తర్వాత మహేశ్ – త్రివిక్రమ్ కాంబోలో మాస్ అంశాలతో రూపొందుతున్న చిత్రమిది.

## "బేబి" దర్శకునికి ట్రెండింగ్ ఐకానిక్ అవార్డ్.!




యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్ ఆనంద్ దేవరకొండ అలాగే విరాజ్ లు హీరోలుగా యంగ్ హీరోయిన్ వైష్ణవి చైతన్య హీరోయిన్ గా దర్శకుడు సాయి రాజేష్ తెరకెక్కించిన సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్ చిత్రం "బేబి" కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రం థియేటర్స్ తర్వాత ఓటిటిలో అలాగే ఆ తర్వాత బుల్లితెరపై మాసివ్ రెస్పాన్స్ తో అన్ని చోట్లా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. అయితే ఇలాంటి చిత్రాన్ని అందించిన దర్శకుడు సాయి రాజేష్ కి అయితే లేటెస్ట్ గా ఓ అవార్డు దక్కింది. రీసెంట్ గా జరిగిన ఇనోవేటివ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లో అయితే ట్రెండింగ్ ఐకానిక్ దర్శకునిగా సాయి రాజేష్ అవార్డు దక్కించుకున్నాడు. దీనితో బేబి అవార్డ్స్ హంట్ స్టార్ట్ అయ్యింది అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ బ్యూటిఫుల్ చార్ట్ బస్టర్ ఆల్బమ్ ని అందించగా ఎస్ కే ఎన్ నిర్మాణం వహించారు.

## డిగ్రీ తర్వాత మిలటరీ శిక్షణ తప్పనిసరి చేయాలి: కంగన



భారతదేశంలోని ప్రతి ఒక్కరూ డిగ్రీలు పూర్తి చేసాక మిలటరీలో చేరి శిక్షణ పొందడాన్ని తప్పనిసరి చేయాలని క్వీన్ కంగన అన్నారు. దీనివల్ల సోమరితనం బాధ్యతారాహిత్యం అంతరిస్తాయని అన్నారు. క్వీన్ నటించిన తేజస్ త్వరలో విడుదలకు సిద్ధంగా ఉంది. ఇందులో కంగన ఫైటర్ పైలట్‌గా నటించింది. తన పాత్ర కోసం జీవితంలోని సవాళ్లను పరిశోధించడంలో అచంచలమైన అంకితభావాన్ని ప్రదర్శించింది. లెఫ్టినెంట్ శివాంగి సింగ్‌తో చర్చా గోష్టిలో కంగనా మన దేశ సరిహద్దులను కాపాడుతున్న ధైర్యవంతుల పట్ల తనకున్న ప్రగాఢమైన విశ్వాసాన్ని అచంచల గౌరవంతో కూడుకున్న అభిమానాన్ని వెల్లడించింది.కంగన మాట్లాడుతూ–"సరిహద్దుల్లో స్థిరపడిన ఒక సైనికుడి భావోద్వేగ ప్రయాణాన్ని ఆవిష్కరించే సినిమా 'తేజస్'. ఇది ఒక భారతీయ సైనికుడి మనోభావాలను, వారి నైతికతపై చర్చల ప్రభావాన్ని తెరపై ఆవిష్కరిస్తుంది. సైనికుడి సాహసాలను తెరపై చూస్తారు" అని తెలిపారు. 'తేజస్' ట్రైలర్ ఇటీవలే విడుదలై దేశవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాలను దోచుకుంది. యూరి నిర్మాతలు మరోసారి తమ బ్రాండ్ సినిమాని తెరకెక్కించారని నమ్మకాన్ని కలిగించింది. కంగన ఈ చిత్రంలో ఛాలెంజింగ్ పాత్రలో నటించారు. ట్రైలర్‌కు విశేషమైన వ్యూస్ రావడంతో పాటు సర్వత్రా ప్రశంసలు దక్కాయి. ఆర్ఎస్‌విపి నిర్మించిన తేజస్‌లో కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించగా, సర్వేష్ మేవారా దర్శకత్వం వహించారు. సర్వేష్ ఈ చిత్రానికి రచయిత. రోనీ స్క్రూవాలా నిర్మించారు. ఈ చిత్రం 2023 అక్టోబర్ 27న థియేటర్లలోకి రానుంది. కంగన నటించిన పీరియడ్ డ్రామా 'ఎమర్జెన్సీ' త్వరలో విడుదలకు సిద్ధం కానుంది. దీనిలో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ పాత్రలో కంగన కనిపించనుంది. ఈ ప్రాజెక్ట్ తో కంగన సోలో డైరెక్టర్‌గాను సత్తా చాటనుంది. ఎమర్జెన్సీలో అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి, విశాక్ నాయర్, శ్రేయాస్ తల్పాడే తదితరులు నటించారు. మూడేళ్లుగా తేజస్ ప్రయాణం తేజస్ మూడేళ్లుగా చిత్రీకరణ దశలో ఉంది. ఎయిర్ స్ట్రైక్స్ నేపథ్యంలో తెరకెక్కుతున్న భారీ చిత్రమిది. యూరి లాంటి బ్లాక్ బస్టర్ బార్డర్ యాక్షన్ మూవీని అందించిన మేకర్స్ నుంచి వస్తున్న చిత్రంగా తేజస్ పై అంచనాలున్నాయి. బార్డర్ లో భారీ యాక్షన్‌తో విధ్వంసకర వైమానిక విన్యాసాలతో సినిమా గగుర్పాటుకు గురిచేస్తుందని ట్రైలర్ తో స్పష్టత వచ్చింది. ఇందులో మునుపెన్నడూ చూడని గొప్ప అనుభూతిని ఈ సినిమా ప్రేక్షకులకు అందించనుంది. ఇందులో దేశం కోసం పోరాడే వైమానిక దళ కమాండర్ గా కంగన నటించింది. ఈ సినిమా బయోపిక్ కాదని నిర్మాతలు గతంలోనే ధృవీకరించారు. ఈ చిత్రం అక్టోబర్ లో టైగర్ ష్రాఫ్ 'గణపత్'తో ఢీ కొడుతుందని ప్రచారం సాగినా అలాంటిదేమీ లేదని తేలింది. మూడేళ్లుగా తేజస్ చిత్రీకరణ సాగుతోంది. వీఎఫ్ ఎక్స్ కోసం టీమ్ ఎక్కువ సమయం తీసుకున్నట్టు వెల్లడించింది. ఈ చిత్రాన్ని ముందుగా డిసెంబర్ 2020లో విడుదల చేయాలని నిర్ణయించారు. ఆగస్ట్ 2020లో సినిమా విడుదల తేదీని కంగన ప్రకటించింది.

## యూఎస్ ప్రీమియర్స్ కి "టైగర్ నాగేశ్వర రావు" రెడీ!




టాలీవుడ్ స్టార్ హీరో, మాస్ మహారాజ రవితేజ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ వంశీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ టైగర్ నాగేశ్వర రావు. ఈ చిత్రం ను అక్టోబర్ 20, 2023 న థియేటర్ల లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అయితే యూఎస్ ప్రీమియర్స్ కి కూడా టైగర్ నాగేశ్వర రావు రెడీ అవుతున్నాడు. అక్టోబర్ 19 నుండి యూఎస్ ప్రీమియర్స్ షురూ కానున్నాయి. అనుపమ్ ఖేర్, నుపూర్ సనన్, రేణు దేశాయ్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## రావిపూడి బాలీవుడ్ రూట్



టాలీవుడ్ లో ప్రస్తుతం మోస్ట్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ గా తిరుగులేని ఇమేజ్ తో దూసుకుపోతున్న వ్యక్తి అనిల్ రావిపూడి. ప్రస్తుతం ఇతని నుంచి భగవంత్ కేసరి చిత్రం వస్తోంది. ఈ సినిమా హిట్ అయితే డబుల్ హ్యాట్రిక్ ని అతని ఖాతాలో వేసుకుంటాడు. రాజమౌళి తర్వాత టాలీవుడ్ లో ఫ్లాప్ అంటూ లేకుండా సినిమాలు చేస్తోన్న దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకుంటాడు. అనిల్ రావిపూడి బెస్ట్ మూవీస్ లో ఎఫ్ 2 కచ్చితంగా ఉంటుందని చెప్పాలి. రెండు తరాలకి చెందిన ఇద్దరు హీరోలని తీసుకొని అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా సినిమాని ఆవిష్కరించి బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకున్నాడు. ఈ చిత్రంలో వరు తేజ్ మొదటిసారి పూర్తిస్థాయిలో కామెడీ చేశారు. 30 కోట్లతో నిర్మించిన ఈ మూవీ ఏకంగా 100 కోట్లు కలెక్ట్ చేసి రికార్డు సృష్టించింది. ఇప్పటికి ఎఫ్2 మూవీ టీవీలలో కూడా ఆడియన్స్ ని అలరిస్తూ ఉంటుంది. ఇప్పుడు ఈ చిత్రాన్ని దిల్ రాజు బాలీవుడ్ లో రీమేక్ చేయాలని అనుకుంటున్నారు. కచ్చితంగా సినిమాలో ఉన్న ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ డ్రామా బాలీవుడ్ ప్రేక్షకులకి కనెక్ట్ అవుతుందని అంచనా వేస్తున్నారు. అందుకే మూవీని హిందీలో ఇద్దరు స్టార్స్ తో చేయాలని అనుకుంటున్నారు. దానికి సంబంధించిన కసరత్తులు స్టార్ట్ అయ్యాయి. భగవంత్ కేసరి రిలీజ్ తర్వాత అనిల్ రావిపూడి ఎఫ్ 2 హిందీ రీమేక్ పైన వర్క్ చేస్తారనే టాక్ వినిపిస్తోంది. త్వరలో ఈ సినిమాకి సంబంధించిన అఫీషియల్ కన్ఫర్మేషన్ వచ్చే అవకాశం ఉంది. దిల్ రాజు బాలీవుడ్ లో కూడా స్టార్ ప్రొడ్యూసర్ అనిపించుకోవాలని అనుకుంటున్నారు. జెర్సీ, హిట్ సినిమాలని హిందీలో రీమేక్ చేశారు. ఈ రెండు పెద్దగా నార్త్ ఇండియన్ ఆడియన్స్ కి కనెక్ట్ కాలేదు. మూడో ప్రయత్నంగా తన బ్యానర్ లోనే వచ్చి ఎఫ్2ని రీమేక్ చేయడానికి రెడీ అవుతున్నారు. ఈ మూవీ అయితే గ్యారెంటీ సక్సెస్ అని భావించి ముందడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ సినిమా ఏ మేరకు దిల్ రాజుకి బాలీవుడ్ లో గేట్ పాస్ గా ఉపయోగపడుతుందో చూడాలి.



Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2/29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989